www.nagaranijam.com

PRGI/RNI NO : APTEL/2013/54450



నగరనిజం

తెలుగు దినపత్రికలో పనిచేయుటకు విలేకరులు కావలెను ఆసక్తి ఉన్నవారు ఈ క్రింది నెంబర్ ఫోన్‌కి చేయగలరు :

☎ 82474 67562

Email Id : nagaranijam@gmail.com


# నగరనిజం


www.nagaranijam.com

అక్షరనిజం నగరనిజం

తెలుగు దిన పత్రిక





| సంపుటి : 14 | సంచిక : 75 | ఉమ్మడి రంగారెడ్డి | సంపాదకులు : ఏలె. పురుషోత్తం | 7,ఆదివారం,జూన్, 2026 | పేజీలు : 4+ | ₹ 3 |
|---|---|---|---|---|---|---|
| Volume : 14 | Issue : 75 | Rangareddy | Editor : Aela.Purushotham | 7,Sunday,June,2026 | Pages : 4+ | Price : 3/- |


Published From Rangareddy, Circulated by Hyderabad, Nalgonda, Khammam, Karimnagar, Warangal, Mahaboobnagar, Medak, Nizamabad, Adilabad


# కోహెడ అంతర్జాతీయ సమీకృత ఫ్రూట్ మార్కెట్ తెలంగాణ వ్యవసాయ రంగానికి కొత్త దిశ







అబ్దుల్లాపూర్ మెట్, 6, జూన్ (నగర నిజం) :రంగారెడ్డి జిల్లా కోహెడలో నిర్మించనున్న అంతర్జాతీయ సమీకృత ఫ్రూట్ మార్కెట్ తెలంగాణ వ్యవసాయ రంగానికి కొత్త దిశను చూపుతుందని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం కోహెడలో అంతర్జాతీయ సమీకృత ఫ్రూట్ మార్కెట్ నిర్మాణానికి, ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సముదాయానికి శంకుస్థాపన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు వేమ్ నరేందర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకరయ్య, నవీన్ యాదవ్, కసిరెడ్డి నారాయణ రెడ్డి, జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి, కిరణ్మయి, గడ్డిఅన్నారం మార్కెట్ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ తెలంగాణ వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించడంతో పాటు రైతులకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఒకప్పుడు హైదరాబాద్ నగర ఆహార అవసరాలను పరిసర ప్రాంతాల రైతులు తీర్చేవారని, ప్రస్తుతం పట్టణీకరణ కారణంగా వ్యవసాయ భూములు తగ్గిపోతున్నాయని పేర్కొన్నారు. అంతర్జాతీయ నగరంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ అవసరాలను తీర్చేందుకు ఆధునిక వ్యవసాయ మౌలిక వసతులు అత్యవసరమని తెలిపారు. గతంలో తాత్కాలిక షెడ్లలో నిర్వహించిన మార్కెట్లలో ప్రమాదాలు చోటుచేసుకున్నాయని గుర్తు చేస్తూ, రైతులకు భద్రతతో కూడిన అంతర్జాతీయ ప్రమాణాల మార్కెట్‌ను ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ మేరకు 240 ఎకరాల్లో ఆధునిక ఫ్రూట్ మార్కెట్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. అంతర్జాతీయ విమానాశ్రయం తర్వాత కోహెడ ఫ్రూట్ మార్కెట్ రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తీసుకువస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పండ్లు, కూరగాయల ఉత్పత్తిని మరింత పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్న ముఖ్యమంత్రి, కందుకూరు ప్రాంతంలో టమోటా ఆధారిత సాస్ తయారీ పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. రైతులకు నిల్వ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడం ద్వారా వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా మారుస్తామని తెలిపారు. ఫ్రూట్ మార్కెట్ నిర్మాణానికి అవసరమైన నిధులను గ్రీన్ ఛానల్ ద్వారా విడుదల చేస్తామని, ఈ ఏడాది డిసెంబర్ నాటికి మార్కెట్ కార్యకలాపాలు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రెండేళ్లలో ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేయాలని సూచించారు. భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణం, రీజనల్ రింగ్ రోడ్, పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాల అభివృద్ధి వంటి కీలక ప్రాజెక్టులను ప్రభుత్వం వేగంగా ముందుకు తీసుకెళ్తోందని చెప్పారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 12 క్లస్టర్లుగా విభజించి సమీకృత ఆధునిక కార్యాలయ సముదాయాల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ల ద్వారా రాష్ట్రానికి భారీ ఆదాయం వస్తోందని, ఆ ఆదాయానికి అనుగుణంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, వరి పంటకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో ధాన్యం ఉత్పత్తి నమోదైందన్నారు. సంక్షేమ కార్యక్రమాల అమలులో భాగంగా 15 లక్షల కొత్త రేషన్ కార్డులు జారీ చేశామని, 3.28 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, రైతులకు రూ.20 వేల కోట్ల రుణమాఫీ, మహిళలకు వడ్డీ రాయితీతో బ్యాంకు అనుసంధాన రుణాలు, మహిళల ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని వివరించారు. రాష్ట్రం ఎదుర్కొంటున్న ఆర్థిక సవాళ్లను అధిగమిస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా కొనసాగిస్తున్నామని, తెలంగాణను దేశంలో ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి తెలిపారు.

# పోచంపల్లి చేనేతకు ప్రపంచ ఖ్యాతి: ఉత్తమ్ కుమార్ రెడ్డి

మాదాపూర్, 6 జూన్ (నగర నిజం) :పోచంపల్లి చేనేత కళకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందని భారీ నీటి పారుదల, సివిల్ సప్లై శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం మాదాపూర్ హైటెక్స్‌లో నిర్వహించిన "థ్రెడ్ పోచంపల్లి" చేనేత ఎగ్జిబిషన్‌ను మంత్రి సందర్శించి, అక్కడ ఏర్పాటు చేసిన చేనేత స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పోచంపల్లి చేనేత కళా వైభవాన్ని ప్రపంచానికి మరింత చేరువ చేసే లక్ష్యంతో ఈ ప్రదర్శనను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చేనేత కార్మికుల అపూర్వ నైపుణ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంతో పాటు వారికి మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. అదే కార్యక్రమానికి తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను సందర్శించి, వర్తకులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోచంపల్లి వస్త్రాలకు ప్రపంచవ్యాప్తంగా విశేష ఖ్యాతి ఉందన్నారు. తాను పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న సమయంలో పోచంపల్లి శాలువాలను ఢిల్లీలో సహచర ఎంపీలు, కేంద్ర మంత్రులకు అందజేస్తూ భూదాన్ పోచంపల్లి వస్త్రాల గొప్పతనాన్ని వివరించేవాడినని గుర్తు చేశారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం తాను నిరంతరం కృషి చేశానని తెలిపారు. ప్రజలు చేనేత వస్త్రాలను ధరించి మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాలని పిలుపునిచ్చారు. హైటెక్స్‌లో జరుగుతున్న వస్త్ర ప్రదర్శనను సందర్శించి నాణ్యమైన చేనేత వస్త్రాలను కొనుగోలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జగన్నాథం, జిల్లా చేనేత అధికారి శ్రీనివాస్ తదితర అధికారులు పాల్గొన్నారు.







# శంషాబాద్ 119 డివిజన్ బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడిగా జీవీ.పవిత్ర సాగర్

- పవిత్ర సాగర్ కు నియామకపు ఉత్తర్వులు అందజేసిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, కార్తీక్ రెడ్డి
- యూత్ నేత జీవీ పవిత్ర సాగర్ ను అభినందించిన సబితా ఇంద్రారెడ్డి
- సబితా ఇంద్రారెడ్డి, కార్తీక్ రెడ్డి తో పాటు పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపిన పవిత్ర సాగర్



**రాజేంద్రనగర్, జూన్ 6 (నగరనిజం ప్రతినిధి):** రంగారెడ్డి జిల్లా కలెక్టర్ హైదరాబాద్ కార్పొరేషన్ పరిధిలోని శంషాబాద్ 119 డివిజన్ బీఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షుడిగా జీవీ పవిత్ర సాగర్ నియమితులయ్యారు. ఈ మేరకు మాజీ హోం మంత్రి సబితా ఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి చేతుల మీదుగా శనివారం నాడు నియామకపు ఉత్తర్వులు అందుకున్నారు జీవి పవిత్ర సాగర్. మరోవైపు పార్టీ యూత్ అధ్యక్షుడిగా నియమితులైన జీవి పవిత్ర సాగర్ ను మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తో పాటు కార్తీక్ రెడ్డి, తదితర జిల్లా పార్టీ నేతలు అభినందించారు. పార్టీ పట్టిష్టత కోసం అంకితభావంతో పనిచేయాలని ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి పిలుపునిచ్చారు. శంషాబాద్ సర్కిల్ పరిధిలోని సిద్ధాంతి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దివంగత జీ వై విద్యాసాగర్ తనయుడు జీవి పవిత్ర సాగర్ బీఆర్ఎస్ పార్టీలో చురుకైన నాయకుడిగా కొనసాగుతున్నారు. పవిత్ర సాగర్ పార్టీలో ఎలాంటి పదవులు ఆశించకుండానే కార్తీక్ రెడ్డి నాయకత్వాన్ని బలపరుస్తూ అధిష్టానం ఇచ్చిన పిలుపుమేరకు పార్టీ పటిష్టత కోసం తన వంతు కృషి చేస్తూ వస్తున్నారు. పార్టీ పటిష్టత కోసం ఆయన చేస్తున్న కృషిని దృష్టిలో పెట్టుకొని కొత్వాల్ గూడ 119 డివిజన్ అధ్యక్షుడు కొనమొల్ల శ్రీనివాస్ సూచన మేరకు పవిత్ర సాగర్ ను శంషాబాద్ 119 డివిజన్ యూత్ అధ్యక్షుడిగా నియమిస్తూ మాజీ హోం మంత్రి సబితా ఇంద్రారెడ్డి, పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు శనివారం నాడు హైదరాబాద్ బంజారాహిల్స్ లోని తన నివాసం వద్ద కార్తీక్ రెడ్డి తో పాటు పార్టీ నేతల సమక్షంలో పవిత్ర సాగర్ కు నియామకపు ఉత్తర్వులు అందించారు సబితా ఇంద్రారెడ్డి. అదేవిధంగా శంషాబాద్ 119 డివిజన్ యూత్ ఉపాధ్యక్షులుగా శివ గౌడ్, గుర్రంపల్లి చంద్రశేఖర్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా పెట్రోల్ సాయి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా దీపక్ గౌడ్, జీకే నానీ అరుణ్, జాయింట్ సెక్రటరీగా పగడాల ప్రవీణ్ గౌడ్ ను నియమిస్తూ సబితా ఇంద్రారెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి..... రాజేంద్రనగర్ నియోజకవర్గం లో బీఆర్ఎస్ పార్టీని తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. త్వరలో జరగనున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో రాజేంద్రనగర్ నియోజకవర్గం పై గులాబీ జెండా ఎగిరేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఆమె దిశా నిర్దేశం చేశారు. మరోవైపు పార్టీ యూత్ అధ్యక్షుడిగా నియమితులైన జీవీ పవిత్ర సాగర్ తో పాటు కమిటీ సభ్యులకు సబితా ఇంద్రారెడ్డి తో పాటు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి అభినందనలు తెలిపారు.

**పార్టీ పటిష్టత కోసం రేయింబవళ్లు శ్రమిస్తా :జీవి పవిత్ర సాగర్**

గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ శంషాబాద్ 119 డివిజన్ బీఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షుడిగా తనకు అవకాశం కల్పించినందుకు మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, పార్టీ ఇంచార్జ్ కార్తీక్ రెడ్డి, పార్టీ కొత్వాల్ గూడ 119 డివిజన్ అధ్యక్షుడు కొనమొల్ల శ్రీనివాస్ తో పాటు పార్టీ అధిష్టానానికి, జిల్లా నాయకత్వానికి పవిత్ర సాగర్ కృతజ్ఞతలు చెప్పారు. తనకు అప్పగించిన ఈ బాధ్యతలతో శంషాబాద్ డివిజన్ లో పార్టీ పట్టిష్టత కోసం తన వంతు కృషి చేస్తానని ప్రకటించారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో యువకులంతా బీఆర్ఎస్ పార్టీ వైపు మొగ్గు చూపేలా శక్తివంచన లేకుండా కృషి చేస్తానని జీవి పవిత్ర సాగర్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కొత్వాల్ గూడ 119 డివిజన్ అధ్యక్షుడు కొనమొల్ల శ్రీనివాస్, శంషాబాద్ 118 డివిజన్ అధ్యక్షుడు కొలను ప్రదీప్ రెడ్డి,పార్టీ ప్రధాన కార్యదర్శి చిన్న గండు రాజేందర్, శంషాబాద్, కొత్వాల్ గూడ డివిజన్ల ఆర్గనైజింగ్ సెక్రటరీ రాచమల్ల జయసింహ, శంషాబాద్, కొత్వాల్ గూడ డివిజన్ల పార్టీ కన్వీనర్ దేవరంపల్లి బుచ్చిరెడ్డి, మహిళా అధ్యక్షురాలు మదుపతి పరమేశ్వరి నరేందర్, పార్టీ సీనియర్ నేతలు వెంకటరెడ్డి, చెక్కల చంద్రశేఖర్ ముదిరాజ్, మురళి గౌడ్, చిలకమర్రి పరంధాములు, రమేష్, హనుమంతు ముదిరాజ్, రాహుల్ అప్పు, హరికృష్ణ, విజయ్, స్వర్ణదీప్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# లింగారెడ్డిపేట గ్రామసభలో అభివృద్ధి, వర్షాకాల సన్నద్ధతపై చర్చ

- రాష్ట్ర ఉప సర్పంచ్ల ఫోరం ఉపాధ్యక్షులు పెంట గౌడ్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహణ.



లింగారెడ్డిపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్, రాష్ట్ర సర్పంచ్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెంట గౌడ్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సమావేశంలో స్పెషల్ ఆఫీసర్, వ్యవసాయ అధికారి స్రవంతి, ఉప సర్పంచ్ మన్నే లక్ష్మి, వార్డు సభ్యులు మామిళ్ల శివ, వర్గంటి సువర్ణ, శంకరయ్య, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్థాయి అధికారులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, వర్షాకాల సన్నద్ధత తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. గ్రామ ప్రజల సూచనలు, సలహాలను స్వీకరిస్తూ పలు తీర్మానాలు చేశారు.గ్రామసభలో చర్చించిన ప్రధాన అంశాలువర్షాకాల సన్నద్ధత చర్యలు, సురక్షిత తాగునీటి సరఫరా,ఘన వ్యర్థాల నిర్వహణ, జల సంరక్షణ కార్యక్రమాలు,వనమహోత్సవం కింద మొక్కల పెంపకం, ఓటర్ల జాబితా సవరణ, వరద నిర్వహణ మరియు భద్రతా చర్యలు, సాధారణ గ్రామసభ అంశాలు, బడ్జెట్, గత తీర్మానాల సమీక్ష, పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణ, ఇతర ప్రజా సమస్యలు, గ్రామాభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సర్పంచ్ పెంట గౌడ్ పిలుపునిచ్చారు.

# కొండపాక మండలం మర్పడగ గ్రామంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అర్బన్ ఆక్సిజన్ పార్క్‌లో మొక్కలు నాటిన మంత్రి పొన్నం ప్రభాకర్

**మెదక్ బ్యూరో : నగర నిజం :** సిద్దిపేట 5 జూన్ 2026ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ రఘునందన్ రావు ,జిల్లా కలెక్టర్ హైమావతి, సిపి రష్మీ పెరుమాళ్,అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మి కిరణ్ , డిఎఫ్ఓ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ధరిపల్లి చంద్రం, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులు, వివిధ విభాగాల అధికారులు..పర్యావరణాన్ని పరిరక్షించడానికి చెట్టు విలువ తెలుసా అనే పోస్టర్ ఆవిష్కరించిన రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్....మొక్కలు నాటి సంరక్షించాలని ప్రతిజ్ఞ చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్



### మంత్రి పొన్నం ప్రభాకర్ కామెంట్స్

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సిద్దిపేట అటవీ శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం లాంచనంగా ప్రారంభించాం..ప్రపంచమే కుగ్రామంగా మారుతున్న వేళ పర్యావరణాన్ని కాపాడడానికి మొక్కలు నాటాలి మొక్కలు నాటడం కార్యక్రమంగా కాదు మన జీవితంలో భాగస్వామ్యం కావాలిహుస్నాబాద్ నియోజకవర్గం లో 280 మహిళా సంఘాలకు 13 రకాల వస్తువులు గవర్నర్ గారి చేత మీద స్టీల్ బ్యాంక్ పంపిణీ చేశాం 500 హోటల్స్ కి గ్లాస్ లు పంపిణీ చేశాం..ఈరోజు హుస్నాబాద్ మున్సిపాలిటీ ,సూర్యాపేట తో కలిసి అవార్డు తీసుకుంటుంది..దిల్లీలో కాలుష్యంతో నివసించే పరిస్థితి లేదు..తెలంగాణ లో అలాంటి పరిస్తితి రాకుండా ముఖ్యమంత్రి గారు ఈవి పాలసీ తీసుకొచ్చారు..దేశంలో ఎక్కడ లేని విధంగా సున్నా టాక్స్ అమలు చేస్తున్నాం..మొక్కలు నాటడానికి అన్ని గ్రామాల్లో ఐదుగురు సభ్యులతో కమిటీ వేశాం..ప్రజలందరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలి..ఒకప్పుడు ఎక్కడ చూసినా పండ్ల మొక్కలు ఉండేవి..ఇప్పుడు లేకపోవడం వల్ల కోతులు గ్రామాల్లోకి వచ్చి ఇబ్బందులు పెడుతున్నాయి..రాష్ట్రంలో 4 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కడుతున్నాం..ప్రతి ఇంట్లో మొక్కలు నాటాలి..ఎక్కడ ప్రభుత్వం స్థలం ఉంటే అక్కడ మొక్కలు నాటాలి..ప్రభుత్వం గీతా కార్మికుల కోసం కాటమయ్య రక్షణ కవచాలు ఇచ్చేటప్పుడు తాటి చెట్లు ఈత చెట్లు నాటిస్తోంది గత సంవత్సరం అటెండర్ నుండి మొదలు జిల్లా కలెక్టర్ వరకు ఒకే రోజు మొక్కలు నాటారు.. అలాంటి కార్యక్రమం తీసుకోవాలి..పర్యావరణాన్ని కాపాడడానికి ప్రకృతి రక్షించడానికి మనం పని చేయాలి పర్యావరణాన్ని కాపాడతామని ప్రతిజ్ఞ చేయడం కాదు పాటించాలి..గ్రామాల్లో మొక్కలు నాటడం లో ఒక కాంపిటీషన్ క్రియేట్ చేయండి.. మంచిగా మొక్కలు నాటిన గ్రామాల్లో సర్పంచ్ లను అభినందించండి..మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు కామెంట్లు: పర్యావరణం దెబ్బ తినడంతో రాను రాను ఆక్సిజన్ సిలిండర్లను బ్యాగులల్లో పెట్టుకుని బయటకు వెళ్లాల్సిన పరిస్థితి వస్తుంది. ప్లాస్టిక్ వాడ మూలంగా క్యాన్సర్ వేగంగా వ్యాపిస్తుంది. ముఖ్యంగా మహిళల్లో బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్ వ్యాపిస్తుంది.ధైనందిత జీవితంలో ప్లాస్టిక్ వాడకంలో నిరోధించాలి. ప్లాస్టిక్ నిషేధం ఇంటి నుండే ప్రారంభం కావాలి.జనాభా కు పెరుగుతున్న జనాభాకు అనుకూలంగా పచ్చదనం కూడా పెరగాల్సిన అవసరం ఉంది.మొక్కలు పెంచే కార్యక్రమం ఉద్యమంల తీసుకురావాలి.సాయిల్ హెల్త్ కార్డు వలన భూసారాన్ని పరీక్షించి భూమికి మేలు చేసే చర్యలు తీసుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సాయి హెల్త్ కార్డులు రైతులందరికీ అందాల చూడాలి. పంట మార్పిడి చేయాలి మిల్లెట్స్, పప్పు, నూనె దినుసులు పండించారు.మెదక్ నుండి ఎల్కతుర్తి వరకు వెళ్లే జాతీయ రహదారిపై ఈ సంవత్సరం ఒక లక్షల మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టనున్నాము. దానిలో భాగంగా ముందుగా భూంపల్లి- అక్బర్పేట్ క్రాస్ రోడ్ నుండి సిద్దిపేట వరకు జాతీయ రహదారికి ఇరువైపులా 20వేల మొక్కలను ఈ నెలలో నాటేందుకు జిల్లా అధికార యంత్రం ద్వారా చర్యలు తీసుకుంటున్నాం.

### జిల్లా కలెక్టర్ కె హైమావతి కామెంట్స్:

పంచభూతాలు పర్యావరణంతో ముడిపడి ఉన్నాయి. పర్యావరణ సమతుల్యం దెబ్బతినకుండా 33 శాతం పచ్చదనాన్ని పునరుద్ధరించాల్సిన అవసరం ఉంది. గత సంవత్సరం జిల్లాలో 22 లక్షల మొక్కలను వనమహోత్సవం కార్యక్రమం ద్వారా నాటి సంరక్షించడం జరిగింది.ఈ సంవత్సరం 17 లక్షల మొక్కలు జిల్లా వ్యాప్తంగా నాటేందుకు నర్సరీలలో మొక్కలను వృద్ధి చేయడం జరిగింది. మొక్కలను నాటి పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాన్నితో పాటు ప్రతి ఒక్కరికి ఉంది. పర్యావరణం సమతుల్యంగా ఉంటేనే జీవకోటి బతుకుతుంది. ఆవు ఆధారిత వ్యవసాయం చేయాలి. ఈ సందర్భంగా సాంస్కృతిక సారథి కళాకారులు పర్యావరణం మరియు మొక్కల పెంపకం పై పాడిన పాటలు ఆకర్ష... ఈ కార్యక్రమంలో కమిషనర్ ఆఫ్ పోలీస్ సాధన రష్మీ పెరుమాళ్, జిల్లా అటవీ శాఖ అధికారి సంధ్యారాణి, జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ లక్ష్మీ కిరణ్, అదనపు డిసిపి సుభాష్ చంద్రబోస్, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ దరిపెల్లి చంద్రం, స్థానిక సర్పంచ్ బాలరాజు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారి రవీందర్, జిల్లా అధికారులు, సిబ్బంది, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# 99 రోజుల ప్రజాపాలనలో గ్రామసభలు.. అభివృద్ధి, పర్యావరణ అంశాలపై చర్చలు

- కొండాపూర్, ముప్పిరెడ్డిపల్లి, జీడిపల్లిలో గ్రామసభల నిర్వహణ
- ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామాభివృద్ధిపై అధికారుల సూచనలు
- పర్యావరణ పరిరక్షణ, నీటి సంరక్షణ, రోడ్డు భద్రతపై అవగాహన



**మెదక్ బ్యూరో :నగర నిజం :** 99 రోజుల ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా కొండాపూర్, ముప్పిరెడ్డిపల్లి, జీడిపల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.ముప్పిరెడ్డిపల్లి గ్రామంలో సర్పంచ్ రాజనర్సింహ ఆధ్వర్యంలో జరిగిన గ్రామసభలో ఉప సర్పంచ్ రామ్‌రెడ్డి, ఐకేపీ అధికారి సత్యనారాయణ, ఏఈఓ వినోద్, కార్యదర్శి ప్రియాంక, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మైపాల్‌రెడ్డి, వార్డు సభ్యులు సింగి శ్వేత రత్నమాల, టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్ యాదవ్‌తో పాటు గ్రామస్తులు, మహిళలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.కొండాపూర్ గ్రామంలో సర్పంచ్ రాము ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించి పలు అభివృద్ధి అంశాలు, గ్రామ సమస్యలపై చర్చించారు.జీడిపల్లి గ్రామంలో జరిగిన గ్రామసభకు సర్పంచ్ నర్సు గారి కృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉప సర్పంచ్ రాజు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ మౌనిక, టీఎస్ జ్యోతి, కానిస్టేబుల్ వెంకట్, ఏఈఓ వినోద్, వార్డు సభ్యులు పాల్గొన్నారు. గ్రామంలో పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపకం, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, నీటి సంరక్షణ, రోడ్డు భద్రత, డ్రంక్ అండ్ డ్రైవ్ నియంత్రణ వంటి అంశాలపై అవగాహన కల్పిస్తూ చర్చలు నిర్వహించారు.

# బిజెపి నేత తల్లోజు ఆచారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన విశ్వకర్మ మహాసభ

**హైదరాబాద్ జూన్ 6 ;** అఖిల్ భారతీయ విశ్వకర్మ మహాసభ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కౌలే జగన్నాథం, ఉపాధ్యక్షులు కాసోజు శ్రీనివాస చారి మరియు మాజీ అమీర్పేట కార్పొరేటర్ పసునూరి బిక్షపతి ఈరోజు మాజీ నేషనల్ బిసి కమిషన్ మెంబర్ మరియు కల్వకుర్తి కంటెస్టెంట్ ఎమ్మెల్యే తల్లోజు ఆచారిని వారి నివాసములో కలిసి శాలువతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా తల్లోజు ఆచారి అన్నగారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియ జేసిన వర్కింగ్ ప్రెసిడెంట్ గుండోజు గంగాధర్, ప్రధాన కార్యదర్శి సంకోజు లింగా చారి, కోశాధికారి ఆవంచ మురళీధరాచారి , అధికార ప్రతినిధి పడాల సతీష్ చారి, గౌరవ సలహాదారు కనపర్తి లక్ష్మణ్ చారి మహిళా గౌరవ అధ్యక్షురాలు సావిత్రి పట్నాల, కస్తోజు శ్రావణి మహిళా అధికార ప్రతినిధి, ఇంద్రాల అశ్విని మహిళా ఉపాధ్యక్షురాలు, బోనాల ఇందిర మహిళాకార్య దర్శి , దాసోజు లక్ష్మణా చారి ఉపాధ్యక్షులు, కొల్లోజు సురేష్ చారిప్రచార కార్యదర్శి, నరహరి



చారి ముఖ్య సలహా దారు వీరాచారి జాయింట్ సెక్రటరీ, రాష్ట్ర కార్యదర్శి కర్ణకంటి నరసింహాచారి. ఉపాధ్యక్షుడు కట్ట వెంకటేష్. అధ్యక్షుడు దాసోజు లక్ష్మణ్ చారి, ఉపాధ్యక్షుడు శ్రీరామ్ మహిపాల్ చారి, వెంకట్ చారి సలహా దారు, ఎడవల్లి రాఘవాచారి యూత్ సెక్రటరీ, కొండోజు సురేష్ చారి అధ్యక్షుడు అంబర్ పేట, కె లోకనాథం జుజ మెంబర్, తదితరులు అభినందించారు .

# ఈనెల 10న ఫ్యూచర్ సిటీకి సీఎం రేవంత్ రెడ్డి

- ఎఫ్ సిడిఏ భవనాన్ని పరిశీలించిన మాజీ శాసనసభ్యులు కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి

**కందుకూరు జూన్ 06, (నగరనిజం) :** ఈనెల 10వ తేదీన ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీ భవనాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జి మాజీ శాసనసభ్యులు కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి తెలిపారు. శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులతోపాటు మాజీ శాసనసభ్యులు తీగల కృష్ణారెడ్డి తో కలిసి ఫ్యూచర్ సిటీలో నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీ భవనాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త పట్టణం నిర్మాణంతో హైదరాబాద్ నగరంపై



ఒత్తిడిని నివారిస్తామని ఆయన తెలిపారు. ఫ్యూచర్ సిటీలోకి ప్రపంచ స్థాయి విద్య వైద్య సంస్థలు రానున్నాయని కేఎల్ఆర్ స్పష్టం చేశారు. యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు భారీగా లభిస్తాయని తెలిపారు. హైదరాబాద్ పై ఒత్తిడి తగ్గిచేందుకే కొత్త పట్టణం కట్టడానికి కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు. మరో రెండేళ్లలో ఫ్యూచర్ సిటీలో అత్యాధునిక సౌకర్యాలతో సౌలతలు కల్పించి మహానగరాన్ని నిర్మిస్తామని కేఎల్ఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం మార్కెట్ కమిటీ చైర్మన్ సభావాట్ క్రిష్ణ నాయక్, వైస్ చైర్మన్ చాకలి యాదయ్య, మాజీ జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, దేప భాస్కర్ రెడ్డి, మహేశ్వరం శివగంగ ఆలయ కమిటీ చైర్మన్ అల్లె కుమార్, రామిడి గోపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# కపిల్ విద్యా వారధి ఫౌండేషన్‌లో చోటు దక్కించుకున్న సరస్వతి



**రాయికల్ జూన్ 06 (నగర నిజం)** జగిత్యాల జిల్లా రాయికల్ మండలం భూపతిపూర్ గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని మామిడిపల్లి సరస్వతి ప్రతిష్ఠాత్మక కపిల్ విద్యా వారధి ఫౌండేషన్ ఎంపికలో చోటు దక్కించుకొని తన ప్రతిభను చాటుకుంది. ఇటీవల ప్రకటించిన ఫలితాల్లో ఆమె ఎంపిక కావడం పాఠశాల, గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. పదో తరగతిలో 566 మార్కులు సాధించిన సరస్వతి ఇప్పటికే బాసర ట్రిపుల్ ఐటీలో సీటు పొందగా, ఇప్పుడు కపిల్ విద్యా వారధి ఫౌండేషన్ ద్వారా మరో అరుదైన అవకాశాన్ని అందుకుంది. ఈ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆమె ఎంచుకున్న కోర్సును ఆరు సంవత్సరాల పాటు పూర్తి ఆర్థిక సహాయంతో అభ్యసించే అవకాశం లభించింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యు.వి. రమణి, సీనియర్ ఉపాధ్యాయుడు బొల్లె చిన్నయ్యతో పాటు ఉపాధ్యాయులు సరస్వతిని అభినందించి, ఆమె భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. గ్రామ సర్పంచ్ భావన మహేందర్ మాట్లాడుతూ సరస్వతి విజయం గ్రామానికి గర్వకారణమని పేర్కొంటూ, ఆమె ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశీర్వదించారు. అలాగే నాయకులు సంజీవ్ చారి, జక్కుల చంద్రశేఖర్, జక్కుల రాజేంద్ర ప్రసాద్, లావణ్య, మహేశ్వర్ రావు, ఏనుగు ముత్యం రెడ్డి తదితరులు సరస్వతిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. సరస్వతి సాధించిన విజయం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు.

## బదిలీపై వెళ్తున్న జేవివో వసంతకు ఘన సత్కారం



**కందుకూరు జూన్ 06 (నగరనిజం)** :కందుకూరు మండల పరిధిలోని పులిమామిడి గ్రామంలో సేవలందించిన జూనియర్ వెటర్నరీ అధికారి (జేవివో) వసంత బదిలీపై వెళ్తుండగా గ్రామ సర్పంచ్ ఎంబడి రమేష్ ఆధ్వర్యంలో ఆమెకు ఘనంగా సత్కారం నిర్వహించారు. గ్రామంలోని పశువులకు నాణ్యమైన వైద్య సేవలు అందించి పశుపోషకుల మన్ననలు పొందిన వసంత సేవలను ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, రైతులు కొనియాడారు. అనంతరం గ్రామానికి కొత్తగా నియమితులైన జేవివో మల్లేష్‌కు గ్రామ ప్రజల తరపున ఘన స్వాగతం పలికారు. గ్రామంలోని పశుసంవర్ధక రంగ అభివృద్ధికి కృషి చేసి, పశుపోషకులకు అందుబాటులో ఉండాలని సర్పంచ్ ఎంబడి రమేష్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పాపగల రాములు వార్డు సభ్యులు బట్టు ఆంజనేయులు, పాపగల మహేష్ ,జాల ప్రవీణ్, రైతులు రేవెల్లె నరసింహ, బుక్క వెంకటరెడ్డి, గంగాధర్ రెడ్డి, బట్టు మల్లేష్, బండ నగేష్, తదితరులు పాల్గొన్నారు.

## కోటి చెరువు శిఖం భూమిని పవన్ కబ్జా చేశారు: కవిత

**హైద్రాబాద్ జూన్6 ,నగర నిజం** :తెలంగాణ రాజకీయాల్లో భూకబ్జాల వ్యవహారం ఇప్పుడు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వర్సెస్ కవితగా మారి సరికొత్త వివాదానికి తెరలేపింది. హైదరాబాద్‌లోని 'కోటిచెరువు' శిఖం భూమిని పవన్ కల్యాణ్ కబ్జా చేశారంటూ టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. జూబ్లీహిల్స్‌లోని పార్టీ ఆఫీస్‌లో జరిగిన ప్రెస్ మీట్‌లో ఆమె మాట్లాడుతూ.. పవన్ గనుక ఆ భూమిని ఆక్రమించలేదని చెబితే, వెంటనే ఆ స్థలాన్ని తెలంగాణ ప్రభుత్వానికి అప్పగించి, అక్కడి నిర్మాణాలను, మట్టిని తొలగించాలని డిమాండ్ చేశారు. నీటిపారుదల శాఖ రికార్డుల ప్రకారం ఆ 10 ఎకరాల భూమి పూర్తిగా 'శిఖం' (ప్రభుత్వ) భూమి అని కవిత స్పష్టం చేశారు. కానీ రిజిస్ట్రేషన్ సమయంలో కేవలం 3 ఎకరాలను మాత్రమే శిఖం భూమిగా చూపి, మిగిలిన 7 ఎకరాలను 'మాగాణి' (ప్రైవేట్) భూమిగా మార్చేశారని.. ఇది స్పష్టమైన నిబంధనల ఉల్లంఘనే అని ఆమె ఎండగట్టారు.

# జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేతకు పోరాట కమిటీ ఏర్పాటు



**నగర నిజం న్యూస్ , జవహర్ నగర్, తేదీ: 6 జూన్:** ప్రజల ఆరోగ్యానికి తీవ్ర ముప్పుగా మారిన జవహర్ నగర్ రాంకీ చెత్త డంపింగ్ యార్డును వెంటనే ఎత్తివేయాలని వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, కార్మిక సంఘాలు, సామాజిక సంస్థల ప్రతినిధులు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం బాలాజీనగర్ దళిత సంక్షేమ భవన్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీని ఏర్పాటు చేశారు. సమావేశానికి ఇఫ్టూ షేక్ షావలి, ఏఐఎఫ్‌టీయూ వై. మల్లేష్, ఐఎఫ్‌టీయూ శివబాబు, టీయూసీఐ వి. ప్రవీణ్ అధ్యక్షత వహించారు. సమావేశంలో సిపిఐ మాజీ ఎంపీటీసీ తోటపల్లి శంకర్, సిపిఎం శివన్నారాయణ, బీఎస్పీ బిర్రు యాకస్వామి, మాజీ మేయర్ మేకల కావ్య, బీఆర్ఎస్ కొండల్ ముదిరాజ్, ఆలూరి రాజశేఖర్, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి, తెలంగాణ రక్షణ సేన లలిత యాదవ్, తెలంగాణ జనసమితి భద్రగామి అంజనేయులు, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ అనురాధ, జయసుధ, సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ గడ్డం సదానందం, ముస్లిం కమిటీ పాషామియా, బహుజన సత్త సింగరాయ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో భవిష్యత్ కార్యాచరణలో భాగంగా డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీని ఏర్పాటు చేశారు. గౌరవ సలహాదారులుగా మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్, మాజీ ఉపసర్పంచ్ ఆర్. నర్సింహ్మా గౌడ్, కల్లెపల్లి సదానందంను నియమించారు. కమిటీ చైర్మన్‌గా ఇఫ్టూ షేక్ షావలి, కన్వీనర్‌గా సిపిఐ ఉమామహేష్, కోశాధికారిగా శివబాబు, కో కన్వీనర్లుగా మేకల కావ్య, కొండల్ ముదిరాజ్, ఆలూరి రాజశేఖర్, శివన్నారాయణ, లలిత యాదవ్, అంజనేయులు, అనురాధ, గడ్డం సదానందం, వై. మల్లేష్, ప్రఫుల్ రాంరెడ్డి, పాషామియా, సింగరాయ గౌడ్, యాకస్వామిలను ఎన్నుకున్నట్లు నిర్వాహక కమిటీ ప్రకటించింది. ప్రజాసంఘాలు, కుల సంఘాలు, బస్తీ సంఘాలు, సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు కమిటీ సభ్యులుగా కొనసాగుతారని తెలిపారు. గాలి, నీరు, భూమిని కలుషితం చేస్తున్న డంపింగ్ యార్డును వెంటనే ఎత్తివేయాలని, జవహర్ నగర్ పరిధిలోని బస్తీలలో రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సరఫరా, వంద పడకల ఆసుపత్రి వంటి మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని సమావేశంలో తీర్మానించారు. డంపింగ్ యార్డు సమస్యను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే పోరాట కమిటీ ఆధ్వర్యంలో విస్తృత ప్రజా ఆందోళనలు చేపడతామని, ఆ పరిస్థితులకు ప్రభుత్వం, సంబంధిత అధికారులు నైతిక బాధ్యత వహించాల్సి ఉంటుందని సమావేశంలో పలువురు నాయకులు హెచ్చరించారు.

## ఈవిఎం గోడౌన్ ను తనిఖీ చేసిన ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్,



**ఖమ్మం :(నగర నిజం బ్యూరో)జూన్ 6:** త్రైమాసిక తనిఖీల్లో భాగంగా సమీకృత జిల్లా కలెక్టరేట్ ఆవరణలో ఉన్న ఈవిఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి సోమవారం తనిఖీ చేశారు. ముందుగా ఈవిఎం గోడౌన్ సీల్ ను పరిశీలించి రాజకీయ ప్రతినిధులు, అధికారుల సమక్షంలో సీల్ తీసి లోపలికి వెళ్ళి ఈ.వి.ఎం., వి.వి.ప్యాట్లు ఉన్న గది లోపల పరిశీలన చేసి తిరిగి సీల్ వేయించారు. తనిఖీ రిజిస్టర్ లో జిల్లా కలెక్టర్ సంతకం చేసి మాట్లాడుతూ, ఈవిఎంల భద్రత ముఖ్యమైనదని, సీసీ కెమెరాల పని తీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సెక్యూరిటీ గార్డ్ కు తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రాజు, కలెక్టరేట్ ఎన్నికల డిటి అన్సారీ, రాజకీయ పార్టీ ప్రతినిధులు ఆమ్ ఆద్మీ పార్టీ, బహుజన్ సమాజ్ పార్టీ, బిఆర్ఎస్, బీజేపి, సిపిఐ(ఎం), ఐ.ఎన్.సి., తెలుగు దేశం పార్టీ ప్రతినిధులు ఎస్. సుబ్బారావు, వి. రామయ్య, ఎల్.సతీష్ బాబు, వి.రాజేష్, ఎన్.వీర బాబు, ఏ.గోపాల్, పాలడుగు టి.ఆర్. కృష్ణ ప్రసాద్, సంబంధిత అధికారులు, తదితరులు ఉన్నారు.

# కొత్వాల్ గూడ 119 డివిజన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శిగా చిలకమర్రి పరంధాములు





- పరంధాములు కు నియామకపు పత్రాన్ని అందజేసిన పట్లోళ్ల కార్తీక్ రెడ్డి
- పార్టీ అధ్యక్షుడు కొనమొల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్తీక్ రెడ్డిని కలిసిన పరంధాములు

**రాజేంద్రనగర్, జూన్ 6 (నగరనిజం ప్రతినిధి)** గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ శంషాబాద్ సర్కిల్ పరిధిలోని ఆర్బీ నగర్ కాలనీకి చెందిన గులాబీ పార్టీ సీనియర్ నాయకుడు, దళిత నేత చిలకమర్రి పరంధాములు బీఆర్ఎస్ పార్టీ కొత్వాల్ గూడ 119 డివిజన్ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. పార్టీ 119 డివిజన్ అధ్యక్షుడు కొనమొల్ల శ్రీనివాస్ సూచన మేరకు చిలకమర్రి పరంధాములు ను కొత్వాల్ గూడ 119 డివిజన్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ఆ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు శనివారం నాడు పార్టీ కొత్వాల్ గూడ 119 డివిజన్ అధ్యక్షుడు కొనమొల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో చిలకమర్రి పరంధాములు తో పాటు ఇతను పార్టీ నేతలు కార్తీక్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు కొనమొల్ల శ్రీనివాస్ సూచన మేరకు పార్టీ సీనియర్ నాయకుడైన చిలకమర్రి పరంధాములును పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ కార్తీక్ రెడ్డి నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన కార్తీక్ రెడ్డి.... చిలకమర్రి పనుందాములు కు అభినందనలు తెలిపారు. సమిష్టి కృషితో పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మరోవైపు తనపై ఎంతో నమ్మకం ఉంచి పార్టీ ప్రధాన కార్యదర్శి పదవి అప్పగించినందుకు మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, పార్టీ ఇంచార్జ్ కార్తీక్ రెడ్డితో పాటు కొత్వాల్ గూడ 119 డివిజన్ అధ్యక్షుడు కొనమొల్ల శ్రీనివాస్ తదితర పార్టీ సీనియర్ నేతలకు చిలకమర్రి పరంధాములు కృతజ్ఞతలు చెప్పారు. తనకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నెరవేరుస్తానని, పార్టీ బలోపేతం కోసం తన వంతు కృషి చేస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కొత్వాల్ గూడ 119 డివిజన్ అధ్యక్షుడు కొనమొల్ల శ్రీనివాస్, శంషాబాద్ 118 డివిజన్ అధ్యక్షుడు కొలను ప్రదీప్, మహిళా అధ్యక్షురాలు మధుపతి పరమేశ్వరి నరేందర్, పార్టీ శంషాబాద్ రెండు డివిజన్ల కోఆర్డినేటర్ దేవరంపల్లి బుచ్చిరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాచమల్ల జయసింహ, పార్టీ సీనియర్ నేతలు చిన్నగండు రాజేందర్, బైరమోని మల్లేష్ ముదిరాజ్, మంచర్ల హరికృష్ణ, రమేష్, వెంకట్ రెడ్డి, వీరమల్లు హనుమంతు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కోటి పార్థివలింగార్చన మహోత్సవం





**నర్సాపూర్ జూన్ 6 :** శ్రీ వాగ్దేవి సంస్కృత భారతి ఆధ్వర్యంలో నర్సాపూర్ లోని ఆర్య వైశ్య సంఘం కన్యకాపరమేశ్వరి దేవాలయ ప్రాంగణములో శ్రీ లక్ష్మీ సౌభాగ్యవతి కల్వకుంట్ల జ్యోతి మిత్ర బృందం పర్యవేక్షణలో కోటి పార్థివలింగార్చన మహోత్సవము అత్యంత వైభవముగా జరిగినది . ముందుగా దీపారాధన, కలశస్థాపన ,గణపతి ,గౌరీపూజ ,నవగ్రహ ఆరాధన ,మరియు భక్తులు పుట్టమన్ను చేత 108 పార్థివ లింగములు చేసి ఆ శివలింగాలకు పంచామృత అభిషేకము రుద్రాభిషేకము, భస్మార్చన ,పుష్పార్చన ,బిల్వార్చన, ధూప, దీప ,నైవేద్యములతో పూజ చేసిరి. శ్రీ వాగ్దేవి సంస్కృత భారతి మరియు బాసర శివయోగి నిర్మల అంబయ్య సిద్ధాంతి సిద్ధాశ్రమ వ్యవస్థాపక అధ్యక్షులు శివ శ్రీ నిర్మల అంబికానాథ శర్మ పూజాది కార్యక్రమములు చేయించి మాట్లాడుతూ బాసర క్షేత్రంలో 12 జ్యోతిర్లింగాల దేవాలయం ఈశాన్య భాగమున కోటి పార్థివలింగ స్తూపము నిర్మించినామని అందులో కోటి (పార్థివ)శివలింగములను ఈనెల 23వ తారీకు స్థాపన చేయ దలచినామని, మరియు ఆసక్తి గల ఆర్యవైశ్య సంఘం మహిళా బృందం వారు 9948332032 సంప్రదించి వారి వివరాలు తెలిపినచో పుట్టమన్ను ఉచితముగా ఇచ్చి మీతో శివలింగాలు మరియు పూజ కార్యక్రమాలు చేయించి అట్టి లింగములను కోటి పార్థివలింగ స్తూపం యందు నిక్షిప్తం చేయబడును అని శర్మతెలిపినారు.. నర్సాపూర్ ఆర్యవైశ్య సంఘ సభ్యులు శ్రీ మల్లేశం మాట్లాడుతూ అధిక మాసంలో పంచమి తిథి రోజు ప్రదోషకాలంలో శివార్చన పార్థివలింగార్చన చేయడం , చేయించడం మిక్కిలి ఆనందం కలగజేసిందని, బాసర క్షేత్రంలో ఈనెల 23న జరిగే మాసోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు హోమాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని అన్నారు. బాసర సరస్వతీ స్తూప పార్థివ లింగస్తుప సహిత ద్వాదశ జ్యోతిర్లింగ మందిర వ్యవస్థాపక అధ్యక్షులు శివశ్రీ నిర్మల అంబికానాధశర్మ ను నిర్వాహకులు ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. దేవాలయ పరిసర కాలిని వాసులు మరియు దేవాలయ ప్రధాన అర్చకులు మరియు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# డ్రైవర్ వైద్యానికి వెస్సో సహాయం




**హైద్రాబాద్ జూన్6 :** వృత్తి రీత్యా నాగర్‌కర్నూలు లో ఉంటున్న గన్నోజు రమేష్ చారి(40) కారు డ్రైవర్‌గా పనిచేస్తూ నెలకు కేవలం పన్నెండు వేల ఆదాయంతో 4500 అద్దె చెల్లిస్తూ అద్దె ఇంటిలో జీవనం సాగిస్తున్నారు. వీరికి 7 మరియు 8 సం.ల వయసు గల ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. రమేష్ చారి గత నాలుగు నెలలుగా తీవ్రమైన గ్యాస్ నొప్పితో బాధపడుతూ పలుచోట్ల ఆసుపత్రుల్లో చికిత్స పొందినప్పటికీ వ్యాధి నిర్ధారణ కాలేదు. అనంతరం కాళ్లు పనిచేయక పోవడంతో మహబూబ్ నగర్ లోని మారుతి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ లో చేరగా వెన్నెముకలో ఇన్ఫెక్షన్ గుర్తించి అత్యవసర శస్త్రచికిత్స చేశారు. శస్త్రచికిత్స అనంతరం బయాప్సీ నివేదికల ద్వారా క్యాన్సర్ వ్యాధి కూడా ఉన్నట్లు నిర్ధారణ అయింది. తదుపరి చికిత్స కోసం ఆయన ను హైదరాబాద్ లో బసవ తారకం క్యాన్సర్ హాస్పిటల్ కు తరలించారు. అక్కడ నిర్వహించిన పరీక్షల్లో ఆయనకు అడ్వాన్స్‌డ్ స్టేజ్ పేగు క్యాన్సర్ ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రస్తుతం వైద్యుల సూచన మేరకు రక్త మార్పిడి సహా ఇతర చికిత్సలు కొనసాగు తున్నాయి. ఇప్పటి వరకు వారి కుటుంబ సభ్యులు, బంధువులు మరియు స్నేహితుల వద్ద అప్పులు చేసి నాలుగు లక్షల వరకు ఖర్చు చేశారు. ఇంకా చికిత్స కొనసాగించడానికి చాలా ఖర్చు అవసరమవుతున్నది. వారి బంధువులు, స్థానిక నాయకుల ద్వారా వెస్సో ట్రస్ట్ గురించి తెలుసుకొని ఆర్థిక సహాయం అందించమని రమేష్ చారి అభ్యర్థించగా, వెస్సో ట్రస్టీలు గౌరవ దాతల సహకారంతో రమేష్ చారి భార్య యామిని కి 50500 రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా వెస్సో ట్రస్ట్ అధ్యక్షుడు బంగారు తాతారావు మాట్లాడుతూ తీవ్ర అనారోగ్యం మరియు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రమేష్ చారి కి ఆర్థిక సహాయం చేసి వారిని ఆదుకొన్న గౌరవ దాతలకు హృదయపూర్వక ధన్యవాదములు తెలిపారు.



# 12 ఏళ్ల బాలుడికి విజయవంతమైన వెన్నెముక శస్త్రచికిత్స

**కుత్బుల్లాపూర్, 6 జూన్ (నగర నిజం ప్రతినిధి):** తూప్రాన్ మండలంలోని ములుగు గ్రామానికి చెందిన 12 ఏళ్ల బాలుడు సాత్విక్ తీవ్రమైన న్యూరోమస్కులర్ స్కోలియోసిస్ వ్యాధితో బాధపడుతుండగా, గుండ్లపోచంపల్లి-కొంపల్లిలోని డాక్టర్ బాలగాని స్పైనల్ & ఆర్థో హాస్పిటల్‌లో వైద్యులు విజయవంతంగా వెన్నెముక శస్త్రచికిత్స నిర్వహించినట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. బాలుడి వెన్నెముక తీవ్రంగా వంగిపోవడంతో సాధారణంగా నడవడం, కూర్చోవడం, రోజువారీ పనులు చేయడం కూడా కష్టసాధ్యంగా మారిందని వైద్యులు తెలిపారు. బాలుడి ఆరోగ్య పరిస్థితిని సమగ్రంగా పరిశీలించిన అనంతరం క్లిష్టమైన శస్త్రచికిత్స నిర్వహించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సను ప్రముఖ వెన్నెముక శస్త్ర వైద్య నిపుణుడు డాక్టర్ శ్రీనివాస్ బాలగాని ఆధ్వర్యంలోని వైద్య బృందం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సుమారు 8




గంటల పాటు విజయవంతంగా నిర్వహించింది. శస్త్రచికిత్సలో భాగంగా వెన్నెముక వంకరను సరిచేసేందుకు ప్రత్యేకమైన స్క్రూలు, రాడ్‌లను అమర్చినట్లు వైద్యులు తెలిపారు. ఆపరేషన్ సమయంలో నరాల పనితీరును నిరంతరం పర్యవేక్షించేందుకు ఆధునిక IONM న్యూరల్ మానిటరింగ్ సిస్టమ్‌ను వినియోగించామని, దీని వల్ల శస్త్రచికిత్సను మరింత భద్రంగా పూర్తి చేయగలిగామని వైద్య బృందం వెల్లడించింది. శస్త్రచికిత్స అనంతరం బాలుడు వేగంగా కోలుకుంటూ ప్రస్తుతం చక్కగా నడుస్తున్నాడని తెలిపారు. ఇలాంటి క్లిష్టమైన వెన్నెముక సమస్యలకు ఆధునిక వైద్య సదుపాయాలతో సమర్థవంతమైన చికిత్స అందించడం తమ ఆసుపత్రి ప్రత్యేకత అని డాక్టర్ శ్రీనివాస్ బాలగాని పేర్కొన్నారు. చిన్న వయస్సులోనే ఇటువంటి సమస్యలను గుర్తించి సమయానికి చికిత్స అందిస్తే పిల్లలు

# గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన కవలలు హర్షిత్ షాన్ పాల్, హర్షిత్ ఐవన్ పాల్

**నగర నిజం హైదరాబాద్, జూన్ 6:** సంగారెడ్డి జిల్లా కు చెందిన 9 ఏళ్ల కవలలు హర్షిత్ షాన్ పాల్ మరియు హర్షిత్ ఐవన్ పాల్ కీబోర్డ్ వాయిద్యంలో అసాధారణ ప్రతిభ కనబరిచి గిన్నిస్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించడం విశేషంగా నిలిచింది. చిన్న వయస్సులోనే సంగీతంపై ఆసక్తి పెంపొందించుకున్న ఈ చిన్నారులు తమ కృషి, అంకితభావంతో అరుదైన ఘనతను అందుకుని అందరి ప్రశంసలు పొందుతున్నారు. ఫిబ్రవరి 2, 2026న సికింద్రాబాద్‌లోని జోరాస్ట్రియన్ క్లబ్‌లో నిర్వహించిన గిన్నిస్ వరల్డ్ రికార్డు కార్యక్రమంలో 22 దేశాలకు చెందిన సుమారు 2,000 మంది కీబోర్డ్ వాద్యకారులు పాల్గొన్నారు. వారిలో 777 మంది కళాకారులు ఒక గంటపాటు ఏకకాలంలో కీబోర్డ్ వాయించి గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించారు. ఈ రికార్డు సాధించిన వారిలో హర్షిత్ షాన్ పాల్, హర్షిత్ ఐవన్ పాల్ కూడా చోటు దక్కించుకోవడం గర్వకారణంగా నిలిచింది. ఈ విజయాన్ని పురస్కరించుకుని మే 29, 2026న నిర్వహించిన "గిన్నిస్ అచీవర్స్ మీట్" కార్యక్రమంలో రికార్డు సాధించిన విద్యార్థులకు హల్లెల్ మ్యూజిక్ స్కూల్ వ్యవస్థాపకుడు మరియు డైరెక్టర్ పాస్టర్ ఆగస్టిన్ దండింగి సర్టిఫికెట్లు అందజేశారు. అలాగే జూన్ 4, 2026న ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలో గిన్నిస్ రికార్డు సాధించిన హర్షిత్ షాన్ పాల్, హర్షిత్ ఐవన్ పాల్‌తో పాటు హల్లెల్ మ్యూజిక్ స్కూల్ విద్యార్థులను పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు వరంగల్ రవి





అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, సంగీత గురువులు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల తల్లిదండ్రులు మాట్లాడుతూ, హల్లెల్ మ్యూజిక్ స్కూల్ వ్యవస్థాపకుడు పాస్టర్ ఆగస్టిన్ దండింగి దూరదృష్టి, మార్గదర్శకత్వం వల్లే ఈ ప్రయాణం ప్రారంభమైందని తెలిపారు. ఆయన ఉచిత కీబోర్డ్ శిక్షణ తరగతులు నిర్వహిస్తూ, చిన్నారులలోని ప్రతిభను గుర్తించి నిరంతరం ప్రోత్సహించారని పేర్కొన్నారు. ఆ ప్రోత్సాహం వల్లే తమ పిల్లలు గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించే స్థాయికి ఎదిగారని కృతజ్ఞతలు తెలిపారు. సంగీత రంగంలో హర్షిత్ షాన్ పాల్, హర్షిత్ ఐవన్ పాల్ మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించి, భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించి తెలంగాణ రాష్ట్రానికి, భారతదేశానికి మంచి పేరు తీసుకురావాలని పలువురు ఆకాంక్షించారు.

# శ్రీ వినాయక నగర్ కాలనీ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి వినతి



**హయత్ నగర్, జూన్ 6(నగర నిజం):** హయాత్‌నగర్ లెక్చరర్స్ కాలనీ డివిజన్ పరిధిలోని శ్రీ వినాయక నగర్ కాలనీ అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డికి కాలనీ వాసులు వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ నాయకురాలు సింగిరెడ్డి మల్లీశ్వరి రెడ్డి ఆధ్వర్యంలో కాలనీ ప్రతినిధులు ఎమ్మెల్యేను కలిసి కాలనీలో నెలకొన్న సమస్యలను వివరించారు. ముఖ్యంగా అంతర్గత అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు, విద్యుత్ స్తంభాలు, మంచినీటి పైప్‌లైన్, సీసీ రోడ్ల నిర్మాణం తదితర అభివృద్ధి పనులను త్వరితగతిన చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కాలనీవాసుల సమస్యలను సానుకూలంగా పరిశీలించి, త్వరలోనే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాలనీ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ వినాయక నగర్ కాలనీ అధ్యక్షుడు దొడ్డి లింగం, కాలనీ సభ్యులు కనకారావు, దుర్గాప్రసాద్, రమేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# నేపాల్ మాజీ ప్రధాని లోకేంద్ర బహదూర్ చంద్‌నుమర్యాదపూర్వకంగా కలిసిన డాక్టర్ జాస్తి వీరాంజనేయులు



**ఖాట్మండు (హైద్రాబాద్) జూన్ 6:** నేపాల్ పర్యటనలో భాగంగా అఖిల భారత పంచాయతీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు, అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు శనివారం సాయంత్రం నేపాల్ మాజీ ప్రధానమంత్రి ను ఖాట్మండులోని లోకంతాలీలో ఉన్న ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డాక్టర్ జాస్తి వీరాంజనేయులు జన్మదినోత్సవం సందర్భంగా మాజీ ప్రధాని లోకేంద్ర బహదూర్ చంద్ దంపతులు ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పుష్పగుచ్ఛం అందజేసి, నేపాలీ సంప్రదాయ ఖాదాతో సన్మానించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం ప్రత్యేకంగా కేక్ తెప్పించి డాక్టర్ జాస్తి వీరాంజనేయు లుతో జన్మదిన కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా డాక్టర్ జాస్తి వీరాంజనేయులు కూడా మాజీ ప్రధాని దంపతులను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఇరు దేశాల మధ్య సాంస్కృతిక, ఆధ్యాత్మిక, చారిత్రక సంబంధాలపై స్నేహపూర్వకంగా చర్చించారు. ఈ సందర్భంగా భారతదేశంలోని ప్రస్తుత రాజకీయ, సామాజిక, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన పలు అంశాలను మాజీ ప్రధాని లోకేంద్ర బహదూర్ చంద్ అడిగి తెలుసుకున్నారు. భారతదేశ అభివృద్ధి ప్రస్థానం, ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతం, గ్రామీణాభివృద్ధి తదితర అంశాలపై డాక్టర్ జాస్తి వీరాంజనేయులు వివరించారు. భారత్-నేపాల్ దేశాల మధ్య స్నేహ, సాంస్కృతిక సంబంధాలు మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు

## మృత్యువులోనూ వీడని బంధం.. ముత్తగూడెంలో

# తల్లీకూతుళ్ల ఆకస్మిక మృతి!

- **వడదెబ్బతో కన్నతల్లి మృతి.. తల్లడిల్లి ప్రాణాలు విడిచిన కూతురు!**
- **కన్నీరుమున్నీరవుతున్న కుటుంబ సభ్యులు, గ్రామస్థులు!**





**ఖమ్మం: (నగర నిజం బ్యూరో) జూన్ 6:** ఖమ్మం జిల్లా, రూరల్ మండలం ముత్తగూడెం గ్రామంలో అత్యంత హృదయవిదారకమైన సంఘటన చోటుచేసుకుంది. ఒకే రోజు గంటల వ్యవధిలోనే తల్లీకూతుళ్లు ఇద్దరూ కన్నుమూయడంతో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ముత్తగూడెం గ్రామానికి చెందిన పొట్టపల్లి అమృతమ్మ (75) అనే వృద్ధురాలు శనివారం వడదెబ్బకు గురై మరణించారని. కన్నతల్లి మరణవార్త విన్న కూతురు పద్మ (49) తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. తల్లిని ఆఖరిచూపు చూసుకోవడానికి తల్లడిల్లుతూ ముత్తగూడెం చేరుకున్నారు. అక్కడ తల్లి మృతదేహాన్ని చూడగానే ఆమె దుఃఖాన్ని ఆపుకోలేకపోయారు. బోరున విలపిస్తూ, గుండె పగిలేలా ఏడుస్తున్న క్రమంలో పద్మ కుప్పకూలిపోయారని గుండెపోటు రావడంతో పద్మ అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. వడదెబ్బతో తల్లి, ఆ షాక్‌ను తట్టుకోలేక గుండెపోటుతో కూతురు కన్నుమూయడంతో ఆ కుటుంబంలో పెద్ద దిక్కును కోల్పోయినట్లయింది. ఒకే రోజు, ఒకే ఇంట్లో తల్లీకూతుళ్లిద్దరూ విగత జీవులుగా మారిన దృశ్యం స్థానికులను తీవ్రంగా కలచివేసింది. కుటుంబ సభ్యుల, బంధువుల రోదనలతో ముత్తగూడెం గ్రామంలో విషాదకర వాతావరణం నెలకొంది.

## పశ్చిమాసియా ఉద్రిక్తతలు.. ప్రధాని మోదీ కీలక భేటీ



**హైద్రాబాద్ జూన్6 ,నగర నిజం ::** పశ్చిమాసియా యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో ఆర్థిక సలహా మండలితో ప్రధాని నరేంద్ర మోదీ సమావేశం నిర్వహించారు. భారత్‌పై యుద్ధ ప్రభావం తగ్గించే చర్యలపై కసరత్తు, ప్రపంచవ్యాప్త అస్థిరతల మధ్య భారతదేశ ఆర్థిక వృద్ధిని మరింత పెంపొందించడానికి వివిధ ఆలోచనలు, చర్యలపై చర్చలు జరిపారు. ఆర్థికవృద్ధిని బలోపేతం చేయడంతో పాటు అంతర్జాతీయంగా వచ్చే ఒడుదొడుకులను తట్టుకునే సామర్థం పెంపుదల, వాణిజ్యానికి మరింత అనుకూల వాతావరణాన్ని కల్పించేలా సంస్కరణలను వేగవంతం చేయడం వంటి అంశాలపై చర్చించినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. ప్రపంచ ఆర్థిక ఒడిదుడుకుల సమయంలో భారత్ ఆర్థిక వృద్ధిని మరింతగా ఎలా ముందుకు తీసుకెళ్లాలనే దానిపై వివిధ వ్యూహాలను, చర్యలను చర్చించారని వారు పేర్కొన్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మళ్లీ ప్రమాదకర స్థాయికి చేరుకున్న సంగతి తెలిసిందే. హర్మూజ్ జలసంధిలో అమెరికా దళాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ డ్రోన్ల దాడికి దిగింది. అయితే వాటిని తిప్పి కొట్టడంతో పరిస్థితి ఒక్కసారిగా వేడెక్కింది. అంతటితో ఆగకుండా ఇరాన్‌కు చెందిన తీర ప్రాంత రాడార్ కేంద్రాలపై అమెరికా వైమానిక దాడులు నిర్వహించింది. ఇప్పటికే సున్నితంగా మారిన గల్ఫ్ ప్రాంతంలో తాజా పరిణామాలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. హర్మూజ్ జలసంధి వద్ద ప్రారంభమైన ఈ తాజా ప్రతిష్ఠంభన ఎటు దారి తీస్తుందనేది ఇప్పుడు ప్రపంచ దేశాలు ఆందోళన చెందుతున్నాయి. ప్రపంచ చమురు ధరలు, అంతర్జాతీయ వాణిజ్యం, పశ్చిమాసియా భద్రతా పరిస్థితులపై కూడా ఈ ప్రభావం పడే అవకాశం ఉంది.

# సంగారెడ్డి లో మరో 210 మంది చిన్నారులకు సైకిళ్ళు అందజేసిన జగ్గారెడ్డి





**సంగారెడ్డి జూన్ 6:** టీపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యం లో చిన్నారులకు విడతలవారీగా సైకిళ్ళ పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. ఇప్పటి వరకు 400 మంది చిన్నారులకు సైకిళ్ళు పంపిణీ చేసిన జగ్గారెడ్డి శనివారం మరో 210 మంది చిన్నారులకు సైకిళ్ళు పంపిణీ చేశారు. చిన్నారుల్లో ఉత్సాహం, ఆరోగ్యం, చదువు పట్ల ఆసక్తి పెంచడమే లక్ష్యంగా జగ్గారెడ్డి ఈ కార్యక్రమం చేపడుతున్నారు. స్థానిక పిఎస్సార్ గార్డెన్ లో ఈ సైకిళ్ళ పంపిణీ కార్యక్రమం జరిగింది. ప్రతీ ఒక్క చిన్నారికి జగ్గారెడ్డి స్వయంగా సైకిల్ అందజేశారు. ఐదు సంవత్సరాలు మొదలుకుని 15 సంవత్సరాల వరకు ఉన్న పిల్లలకు సైకిళ్ళు అందజేశారు. చిన్నారులకు,బాలురకు, బాలికలకు ప్రత్యేకంగా సైకిళ్ళు అందజేశారు. గత వారం టోకెన్ లు ఇచ్చిన వారికి శనివారం సైకిళ్ళు పంపిణీ చేశారు. టోకెన్ లు లేని చిన్నారుల కు మరోసారి సైకిల్ లు పంపిణీ చేసేందుకు వీలుగా అందరి చిన్నారుల ఆధార్ కార్డు, పేరెంట్స్ ఫోన్ నెంబర్స్ తో కూడిన వివరాలు తీసుకోవాలని జగ్గారెడ్డి నిర్వాహకులకు సూచించారు. సైకిళ్ళు రాని చిన్నారులు ఎవరు ఆందోళన పడవద్దని, పేర్లు నమోదు చేసుకున్న వారందరికీ సైకిళ్ళు పంపిణీ చేస్తానని జగ్గారెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జార్జ్, టౌన్ ప్రెసిడెంట్ కిరణ్ గౌడ్, నాయకులు కూన సంతోష్, మహేష్ , సుదీప్ తదితరులు పాల్గొన్నారు.

# తొలకరిలో తడిసి ముద్దైన శంషాబాద్, రాజేంద్రనగర్

- **జోరు వానతో చల్లబడిన వాతావరణం**
- **శంషాబాద్, రాజేంద్రనగర్ ప్రాంతాల్లో జలమయమైన రోడ్లు**

**రాజేంద్రనగర్, జూన్ 6 (నగరనిజం ప్రతినిధి)** రాజేంద్రనగర్ తో పాటు నియోజకవర్గం లోని శంషాబాద్ ప్రాంతాలను తొలకరి పలకరించింది. శనివారం సాయంత్రం ఉన్నట్లుండి ఒక్కసారిగా కురిసిన భారీ వర్షంతో శంషాబాద్, రాజేంద్రనగర్ ప్రాంతాలు తడిసి ముద్దయ్యాయి. కుండపోతగా కురిసిన భారీ వర్షంతో వాతావరణం ఒక్కసారిగా మారిపోవడంతో ఇంతకాలం ఉక్కపోతతో అల్లాడిన జనం ఉపశమనం పొందారు. వేసవికాలం నేపథ్యంలో ఎండ వేడిమితో ప్రజలు అల్లాడుతున్నారు. ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు చేరుకోవడంతో గడిచిన రెండు నెలలుగా జనం బయటకు రావడానికి హడలెత్తిపోయారు. అయితే నైరుతి రుతుపవనాలు కేరళ రాష్ట్రాన్ని తాకడంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వర్షాలు మొదలయ్యాయి. శనివారం సాయంత్రం హైదరాబాద్ సహా రాజేంద్రనగర్, శంషాబాద్



విమానాశ్రయం పరిసర గ్రామాల్లో తొలకరి జల్లులు కురిసాయి. ఉన్నట్లుండి వాతావరణం కాస్త ఒక్కసారిగా మారిపోయి భారీ వర్షం కురియడంతో రాజేంద్రనగర్ తో పాటు శంషాబాద్ పరిసర ప్రాంతాల్లో రోడ్లన్నీ జలమయమయ్యాయి. మరోవైపు ఎండ వేడిమితో అల్లాడిన జనం.... శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి తడిసి ముద్దయ్యారు. వాతావరణం కాస్త ఒక్కసారిగా మారిపోవడం తో ప్రజలు ఎండ వేడిమి నుండి ఉపశమనం పొందారు.

Edited & printed and owner,publisher Yela purushotham,(Regd): H-No 11-21-890,Ntr Nagar,L.B nagar saroor nagar mandal,Rangareddy-Dist,500074, printed Y.p.s publication H-No 11-21-890,Ntr Nagar,L.B nagar, saroor nagar mandal,Rangareddy-Dist,TELANGANA-500074, Editor Yela purushotham.(H.O) : plot no:31,H-No 1-13,kuntloor road,Near hayathanagar,abdullapur mettu mandal,rangareddy dist,TELANGANA-501505,
RNI NO: APTEL/2013/54450.(PRGI) .PH NO:8247467562 Email; nagaranijam@gmail.com.Whatsapp no : 8247467562,WEBSITE: WWW.NAGARANIJAM.COM.TELANGANA STATE

## మాజీ ప్రొటెం చైర్మన్ వెన్నవరం భూపాల్ రెడ్డి 60వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా కేసీఆర్ దంపతులను కలిసిన కుటుంబ సభ్యులు





**నగర నిజం జూన్ 06** తెలంగాణ రాష్ట్ర మాజీ ప్రొటెం చైర్మన్ శ్రీ వెన్నవరం భూపాల్ రెడ్డి తన సతీమణి గీతా భూపాల్ రెడ్డి తో కలిసి 60వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) శోభా దంపతులను తన కుటుంబ సభ్యులతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్ శోభా కేసీఆర్ భూపాల్ రెడ్డి దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేసి, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. భూపాల్ రెడ్డి కుటుంబం పార్టీకి అందించిన సేవలను గుర్తు చేసుకుంటూ, భవిష్యత్‌లో వెన్నవరం కుటుంబానికి సముచితమైన రాజకీయ బాధ్యతలు, ఉన్నత స్థానం కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామచంద్రాపురం మాజీ సర్పంచ్ రాజేశ్వర్ రెడ్డి, పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ శ్రీ వి.ఆదర్శ్ రెడ్డి ,భారతీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి , భూపాల్ రెడ్డి కుమారుడు చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నైరుతి రుతుపవనాల రాకతో హైదరాబాద్ వ్యాప్తంగా పలుచోట్ల వర్షం

- ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది



**హైద్రాబాద్ జూన్ 6** భానుడి భగభగలతో ఉక్కిరిబిక్కిరవుతున్న భాగ్యనగరాన్ని వరుణుడు కరుణించాడు. నైరుతి రుతుపవనాల రాకతో హైదరాబాద్ వ్యాప్తంగా పలుచోట్ల వర్షం కురిసింది. ఫలితంగా ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. జూబ్లీహిల్స్, ఫిలింనగర్, బోరబండ, యూసఫ్‌గూడ, ఎస్ఆర్‌నగర్, సనత్‌నగర్, రాయదుర్గం, మాదాపూర్, గచ్చిబౌలి, ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్ నగర్ ప్రాంతాల్లో వర్షం కురుసింది. హైదర్‌గూడ, ఉప్పరపల్లి పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం పడింది. ఈ వాన జల్లులతో నగరవాసులకు ఉపశమనం లభించినట్లైంది. ఇంకోవైపు రంగారెడ్డి జిల్లా కోహెడ, పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది.

## భరోసా కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం






**మేడ్చల్, జూన్ 6 (నగర నిజం):** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మేడ్చల్ భరోసా కేంద్రం ఆధ్వర్యంలో శనివారం అత్వెల్లి సబ్‌స్టేషన్ లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భరోసా కేంద్రం సిబ్బంది మహిళలు, బాలికలు, యువత, ప్రజలకు పలు కీలక సామాజిక, చట్టపరమైన అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా పోక్సో చట్టం, అత్యాచార నిరోధక చట్టాలు, లింగ వివక్ష, పితృస్వామ్య వ్యవస్థ, లింగ సమానత్వం, సెక్సిజం, మానవ అక్రమ రవాణా, కార్మిక అక్రమ రవాణా, లైంగిక దోపిడీ, ఈవ్ టీజింగ్, అవయవాల అక్రమ రవాణా, బాల్య వివాహాలు, బాలలపై లైంగిక వేధింపులు, గుడ్ టచ్ – బ్యాడ్ టచ్, సైబర్ స్టాకింగ్, సైబర్ బులీయింగ్, సైబర్ మోసాలు వంటి అంశాలపై వివరించారు. అదేవిధంగా ఎమర్జెన్సీ రెస్పాన్స్ సపోర్ట్ సిస్టమ్, మహిళల హెల్ప్‌లైన్ నంబర్లు 1091, 181, బాలల హెల్ప్‌లైన్ 1098, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930 సేవల వినియోగంపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, మహిళలు మరియు బాలలపై జరిగే నేరాల నుంచి రక్షణ పొందేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భద్రతా చర్యలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో భరోసా కేంద్రం కోఆర్డినేటర్ కళ్యాణి, లీగల్ కౌన్సిలర్ రోజా, అఖిల, బి. మౌనిక, సమీనా, డి. మౌనిక పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు.

# ఆర్కే గార్డెన్ డంప్ యార్డ్ వద్ద గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం





- ముఖం గుర్తుపట్టడానికి వీలులేని రీతిలో కుళ్లిపోయిన మృతదేహం
- 25 రోజుల వ్యవధిలో ఆర్కే గార్డెన్ లేఅవుట్ లో ఇద్దరి మృతి
- 25 రోజుల క్రితం ఆర్కే గార్డెన్ నీటి సంపులో గుర్తుతెలియని యువకుడి మృతదేహం లభ్యం

**వరుస ఘటనలతో ఆందోళన**

**రాజేంద్రనగర్, జూన్ 6 (నగరనిజం ప్రతినిధి)** శంషాబాద్ ఆర్.జి.ఐ. ఏ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్కే గార్డెన్ లే అవుట్ లోని డంపింగ్ యార్డ్ వద్ద ఓ గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముఖం గుర్తుపట్టడానికి వీలు లేని రీతిలో కుళ్లిపోయి పడి ఉన్నట్లు స్థానిక పోలీసులు శనివారం సాయంత్రం ప్రకటించారు. శంషాబాద్ సమీపంలోని ఆర్కే గార్డెన్ లోని నీటి సంపులో ఓ గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభించి 25 రోజులు కూడా గడవకముందే తాజాగా ఓ గుర్తు తెలియని మహిళ మృతదేహం లభించడం కలకలం రేపింది. శంషాబాద్ ఆర్.జి.ఐ.ఏ ఎస్.ఐ ఇంద్రసేనారెడ్డి కథనం ప్రకారం మహిళ మృతదేహానికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. శంషాబాద్ సమీపంలో ఔటర్ రింగ్ రోడ్డు పక్కన ఆర్కే గార్డెన్ లే అవుట్ లోని డంపింగ్ యార్డ్ వద్ద ఓ గుర్తు తెలియని మహిళ మృతదేహం పడి ఉన్నట్లు స్థానికులు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలాన్ని సందర్శించిన పోలీసులు మహిళ కుళ్ళిపోయిన మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు మహిళపై అత్యాచారం చేసి ఆపై హత్య చేసి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతురాలి వయసు 28–30 ఉంటుందని, ఒంటిపై స్కై బ్లూ కలర్ టాప్, మరియు డార్క్ బ్లూ కలర్ లెగ్గిన్ ధరించి ఉన్నట్లు ఎస్సై ఇంద్రసేనారెడ్డి ప్రకటించారు. మృతురాలి ముఖంతోపాటు చేతులు కుళ్లిపోయి ఉన్నట్లు, శరీరంపై ఎక్కడ గాయాలు కనిపించడం లేదని ఎస్సై వివరించారు. మహిళ 3 నుండి 5 రోజుల క్రితం చనిపోయి ఉంటుందని భావిస్తున్నట్లు ఎస్సై ఇంద్రసేనారెడ్డి వివరించారు. ఈ మేరకు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించినట్లు ఆయన మీడియాకు వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

**మే 11న ఆర్కే గార్డెన్‌లో గుర్తుతెలియని యువకుడి మృతదేహం లభ్యం**

ఆర్కే గార్డెన్ లేఅవుట్ లో వరుసగా గుర్తుతెలియని వ్యక్తుల మృతదేహాలు లభ్యమవుతుండడం కలకలం రేపుతోంది. 25 రోజుల క్రితం మే 11వ తేదీన ఆర్కే గార్డెన్ లోని నీటి సంపులో ఓ గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభించింది. ఆ యువకుడు ఎవరు, ఇక్కడకు ఎందుకు వచ్చాడు, నీటి సంపులో పడి ఎలా చనిపోయాడు అన్నది మిస్టరీగా మిగిలిపోయింది. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే ఈ ఘటన మర్చిపోకముందే శనివారం నాడు ఆర్కే గార్డెన్ లే అవుట్ లోని డంపింగ్ యార్డు వద్ద గుర్తుతెలియని మహిళ మృతదేహం లభించడం కలకలం రేపింది. వరుసగా గుర్తు తెలియని వ్యక్తుల మృతదేహాలు లభిస్తుండడం తో స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.



# ఆలోచించి కొనాలట...

- భారత మామిడిపండ్లపై అక్కసు వెళ్లగక్కిన అమెరికా జర్నలిస్టు!
- భారత మామిడి పండ్లను విమర్శించిన అమెరికన్ కన్జర్వేటివ్ కామెంటేటర్
- మామిడి పండ్లు అసహ్యంగా ఉన్నాయంటూ వివాదాస్పద వ్యాఖ్యలు
- అమెరికాలో భారత మామిడికి భారీ డిమాండ్ నెలకొన్న వేళ ఈ వ్యాఖ్యలు
- ఆమె వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు, వ్యతిరేకత



**అమెరికా, జూన్ 06 (నగర నిజం):** అమెరికాలో భారతీయ మామిడి పండ్లకు విపరీతమైన ఆదరణ లభిస్తున్న తరుణంలో, ఓ అమెరికన్ పాత్రికేయురాలు చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. భారతీయ మామిడి పండ్ల రుచి, నాణ్యతను తక్కువ చేసి చూపుతూ.. అవి 'అసహ్యంగా' ఉన్నాయని, 'బయోహజార్డ్' అని ఆమె అభివర్ణించారు. ఈ అంశాన్ని వలసలు, హెచ్-1బీ వీసాల చర్చతో ముడిపెట్టడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. టెక్సాస్‌కు చెందిన జర్నలిస్ట్, బ్లేజ్ టీవీ హోస్ట్ సారా గొంజాలెజ్ ఒక పాడ్‌కాస్ట్‌లో ఈ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. బంగినపల్లి వంటి భారతీయ మామిడి రకాలపై ప్రజలు చూపుతున్న ఉత్సాహాన్ని ఆమె ఎద్దేవా చేశారు. "నేను అటువంటి మామిడి పండ్లను ఎప్పుడూ రుచి చూడలేదు. వాటి గురించి వినడానికి కూడా అంత బాగున్నట్టు లేదు. అవి అసహ్యంగా ఉన్నాయి" అని వ్యాఖ్యానించారు. భారతీయ ఉత్పత్తులనే నెపంతో వాటి పరిశుభ్రతపై అనుమానాలు వ్యక్తం చేస్తూ, కొనుగోలు చేసే ముందు అమెరికన్లు ఒకటికి రెండుసార్లు ఆలోచించుకోవాలని ఆమె సూచించారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం అమెరికాలో చర్చనీయాంశంగా మారాయి. ప్రస్తుత సీజన్‌లో అక్కడి మార్కెట్‌లో అల్ఫాన్సో, కేసర్ వంటి భారతీయ మామిడి రకాలకు భారీ డిమాండ్ నెలకొంది. విక్రయ కేంద్రాల వద్ద పొడవైన క్యూలు ఉండటమే కాకుండా, ధరలు అధికంగా ఉన్నప్పటికీ నిల్వలు నిమిషాల్లో అమ్ముడవుతున్నాయి. ముఖ్యంగా భారతీయ సంతతి ప్రజలు ఈ పండ్లను కొనుగోలు చేసేందుకు విశేష ఆసక్తి కనబరుస్తున్నారు. సారా గొంజాలెజ్ వ్యాఖ్యలపై సోషల్ మీడియా వేదికగా తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ఆమె వ్యాఖ్యలు సాంస్కృతిక అహంకారాన్ని, మూస ధోరణులను ప్రతిబింబిస్తున్నాయని నెటిజన్లు మండిపడుతున్నారు. హెచ్-1బీ వీసాలపై తనకున్న వ్యతిరేకతను, భారతీయ సాంస్కృతిక ప్రతీకలుగా నిలిచే మామిడి పండ్లపైకి మళ్లిస్తున్నారని విమర్శించారు. కాగా, భారత్ నుంచి దిగుమతి అవుతున్న మామిడి పండ్ల విషయంలో అమెరికా ఆరోగ్య శాఖ నుంచి ఎటువంటి అధికారిక హెచ్చరికలు జారీ కాలేదు. అమెరికా అధికారులు అత్యంత కఠినమైన నాణ్యతా పరీక్షలు నిర్వహించిన తర్వాతే ఈ పండ్లను మార్కెట్లోకి అనుమతిస్తారు.

## సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- మొయినాబాద్ సీఐ మల్లికార్జున్ రెడ్డి మోత్కుపల్లిలో సీసీ కెమెరాలు, నేరాలపై అవగాహన



మొయినాబాద్, జూన్ 06 (నగర నిజం): సీసీ కెమెరాలు నేరాలు, ఘోరాలను చితిరకరించి మూడవ కన్నుగా నిలుస్తాయని మొయినాబాద్ సీఐ మల్లికార్జున్రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని మోత్కుపల్లి గ్రామాన్ని సీఐ మల్లికార్జున్రెడ్డి, ఎస్సై నయీముద్దీన్తో కలిసి పర్యటించి సీసీ కెమెరాలను పరిశీ లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ప్రతి ఒక్కరు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే నేరాలు, ఘోరాలను వెంటనే పరిష్కరించేందుకు వీలు ఉంటుందన్నారు. గ్రామంలో ఎవరైనా కొత్త వారు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సైబర్ క్రైం పట్ల అప్రమత్తంగా ఉండాలని ఫోన్లలో ఓటీపీలు వచ్చినప్పుడు వాటి నెంబర్లు చెప్పమని అడిగితే ఎవరికి చెప్పవద్దు అని సూచించారు. దాని వల్ల నష్టపోయేది మీరే అని తెలిపారు. ఓటీపీ చెప్పడం వల్ల మీ ఫోన్ డాటా మొత్తం వారి చేతులోకి వెళ్తుందని ఇలా సైబర్ నేరగాళ్లు ఎంతో మంది తయారు అవుతున్నారని సూచించారు. ఉమ్మడి రాష్ట్రం ఆంధ్ర, తెలంగాణలో అప్పట్లో కొంత మంది ఉన్నప్పటికి ప్రస్తుతం వేలల్లో సైబర్ కేటుగాళ్లు పుట్టుకొస్తున్నారన్నారు. వారి పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని మనం సేఫ్ గా ఉన్నప్పుడే కాపాడుకుంటామని అన్నారు. రాను రాను టెక్నాలజీ పెరుగుతున్న దృశ్యా ప్రతి ఒక్కరు ఫోన్లు వాడుతున్నారని వాటి వల్ల కొన్ని మంచి జరగవచ్చు, చెడు జరగవచ్చునన్నారు. మోసాలకు దూరంగా ఉండాలని అన్నారు. గ్రామాలలో ఉన్న ఫామ్ హౌస్లు అధిక సంఖ్యలో వెలుస్తున్నాయని, పుట్టగొడుగులా పుడుతున్నాయని ఇందుకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఫామ్ హౌస్లకు ఒక ప్రత్యేక రిజిస్టర్ ఏర్పాటు చేసిన ఫామ్ హౌస్ల యజమానుల పోన్ నెంబర్లు, ఆధార్ కార్డులు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా ఫామ్ హౌస్లను ఎవరికి లీజ్కు ఇచ్చిన వెంటనే గ్రామ పంచాయతీలో తెలిపే విధంగా ఉండాలని పేర్కొన్నారు. ఫామ్ హౌస్లో ఎప్పుడు ఏమి జరిగిన వెంటనే సైబర్ క్రైమ్ 1930 నెంబర్కు పోన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంపూర్ణరాములు, ఉపసర్పంచ్ సుబ్బారావు, వార్డు సభ్యులు ఎర్రోళ్ల విఠల్, ఎర్రోళ్ల కాంతరాజు, దుర్గపల్లి విజయవాణి, లక్ష్మి, లలిత, ఇందిరమ్మ, వ్యవసాయ అధికారి అనురాధా, పంచాయతీ కార్యదర్శి, నాయకులు మోత్కుపల్లి రాములు, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డుకు మోక్షం ఎప్పుడు..?

**సెంటర్ లైన్ డ్రైనేజీ కోసం రోడ్డు తవ్వారు... వేయడం మాత్రం మరిచారు**

**వివేకానంద విగ్రహం నుంచి మండలంలోని ప్రధాన ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే మార్గం దుస్థితి**

**రెవెన్యూ కార్యాలయం, పాస్‌పోర్ట్ కేంద్రం, సీహెచ్‌సీ, ఏసీపీ కార్యాలయానికి ఇదే దారి**

**ఎన్నిసార్లు వినతులు చేసినా స్పందించని అధికారులు**




మేడ్చల్, జూన్ 6 (నగర నిజం):మేడ్చల్ పట్టణ పరిధిలోని వివేకానంద విగ్రహం నుంచి మండలంలోని పలు కీలక ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే ప్రధాన రహదారి అధ్వాన్నంగా మారి ప్రజలకు నిత్య నరకయాతనగా మారింది. సెంటర్ లైన్ డ్రైనేజీ నిర్మాణం కోసం రహదారిని పూర్తిగా తవ్విన అధికారులు, పనులు పూర్తయిన తర్వాత రోడ్డు పునరుద్ధరణను మాత్రం గాలికొదిలేయడంతో నెలలుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రహదారి సాధారణ మార్గం కాదు. మండల ప్రజలకు అత్యంత కీలకమైన రెవెన్యూ కార్యాలయం (ఎమ్మార్వో), పోస్ట్ ఆఫీస్, పాస్‌పోర్ట్ సేవా కేంద్రం, విద్యాశాఖ కార్యాలయం, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ), భరోసా సెంటర్, ఏసీపీ కార్యాలయం తదితర ప్రధాన ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే ఏకైక ప్రధాన మార్గం. అంతేకాకుండా పరిసర గ్రామాల ప్రజలు కూడా ప్రభుత్వ సేవల కోసం ఇదే రహదారిని వినియోగిస్తున్నారు.రోజూ వందలాది మంది ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, మహిళలు, వృద్ధులు, రోగులు ఈ రహదారిపైనే ప్రయాణించాల్సి వస్తోంది. అయితే డ్రైనేజీ పనుల అనంతరం రోడ్డు మొత్తం గుంతలమయంగా మారి వాహనదారులకు చుక్కలు చూపిస్తోంది. ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతుండగా, పాదచారులు సైతం ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది.ముఖ్యంగా కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు వచ్చే రోగులు, అత్యవసర సేవల కోసం వచ్చే అంబులెన్స్‌లు ఈ దెబ్బతిన్న రహదారిపైనే ప్రయాణించాల్సి రావడం ఆందోళన కలిగిస్తోంది. చిన్నపాటి వర్షం కురిసినా గుంతలు నీటితో నిండిపోవడంతో రహదారి పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. ఎక్కడ గుంత ఉందో, ఎక్కడ రోడ్డు ఉందో తెలియని పరిస్థితి నెలకొంది.సమస్యను పరిష్కరించాలని స్థానికులు, ప్రజాప్రతినిధులు పలుమార్లు సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందించినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ పనులు ప్రారంభించిన సమయంలో త్వరగా పనులు పూర్తి చేసి మెరుగైన రహదారి అందిస్తామని హామీలు ఇచ్చిన అధికారులు, ఇప్పుడు రోడ్డు మరమ్మతుల విషయంలో పూర్తిగా మౌనం వహిస్తున్నారని విమర్శిస్తున్నారు.ప్రజల సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే ప్రధాన రహదారే ఇంత దయనీయంగా ఉండటం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని స్థానికులు మండిపడుతున్నారు. ప్రజల పన్నుల డబ్బుతో చేపట్టిన పనులు చివరకు ప్రజలకే ఇబ్బందులు కలిగించడం దురదృష్టకరమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే రహదారి మరమ్మతులు చేపట్టి ప్రయాణయోగ్యంగా మార్చాలని, మరో ప్రమాదం జరిగే వరకు వేచి చూడకుండా ప్రజల ఇబ్బందులను గుర్తించి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.ప్రజల సమస్యలు వినాల్సిన అధికారుల కార్యాలయాలకు వెళ్లే రహదారే అధ్వాన్నంగా ఉంటే... సామాన్య ప్రజల గోడును ఇంకెవరు పట్టించుకుంటారన్న ప్రశ్న మేడ్చల్ ప్రజల నోట వినిపిస్తోంది.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చిట్కుల్‌లో ప్రత్యేక వార్డు సభ




నగర నిజం జూన్ 06 సంగారెడ్డి జిల్లా ఇస్నాపుర్ మున్సిపాలిటీ పరిధి తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రత్యేక వార్డు సభలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో, శనివారం ఇస్నాపూర్ పురపాలక సంఘం పరిధిలోని చిట్కుల్‌లో 4, 5, 6, 7, 8, 9 వార్డులకు సంబంధించిన ప్రత్యేక వార్డు సభ నిర్వహించారు.ఈ సభకు పురపాలక సంఘం చైర్‌పర్సన్ ఎం. సుమలత,వార్డు సభ్యులు తలారి ఆంజనేయులు, బి. వెంకటేష్, సంఘన్న జ్యోతి, మంజలి సంతోషి, సహనియుక్త సభ్యుడు విష్ణువర్ధన్ రెడ్డి, వెంకట కిషన్ రావు, పురపాలక కమిషనర్, పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.సభలో ప్రజల సమస్యలు, వార్డుల అభివృద్ధి అవసరాలు, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై చర్చ జరిగింది. ప్రజల నుంచి వచ్చిన వినతులు, సూచనలను అధికారులు స్వీకరించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లక్ష్యాలను ప్రజలకు వివరించి, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం మరింత పెరగాలని సభలో పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వార్డుల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నూతన డిప్యూటీ కమిషనర్‌కు కాంగ్రెస్ నాయకుల శుభాకాంక్షలు



ఎల్బీనగర్, జూన్ 6 : సరూర్‌నగర్ సర్కిల్ నూతన డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీకాంత్‌ను ఉమ్మడి శ్రీ రామకృష్ణాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్ నేత, యువజన నాయకుడు చిలక ఉపేందర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఉమ్మడి శ్రీ రామకృష్ణాపురం డివిజన్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను డిప్యూటీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా పారిశుధ్య నిర్వహణను మెరుగుపరిచేందుకు స్వీపర్ల సంఖ్యను పెంచాలని, డివిజన్‌లోని సమస్యలను పరిశీలించి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. వారి వినతిపై స్పందించిన డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ సమస్యలను సానుకూలంగా పరిశీలించి, త్వరలోనే తగిన చర్యలు చేపట్టి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు గట్ల రవీంద్ర, శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి దేవాలయం చైర్మన్ తలాటి రమేష్ నేత, శ్రీ ఖిల్లా మైసమ్మ దేవాలయం చైర్మన్ సురేష్ కుమార్, ముప్పిడి లింగస్వామి గౌడ్, జెల్లా జగన్నాథం, ఎస్.కె. మమ్మద్, పగిళ్ల భూపాల్ రెడ్డి, బొడ్డుపల్లి మహేందర్, నబీ, రఫీ, రామకృష్ణ గౌడ్, కిరణ్ కుమార్, సాయికుమార్, మంచుకొండ శ్రీనివాస్, మల్లేష్ యాదవ్, దోర్నాల చంద్రమౌళి, కృష్ణారావు, వెంకటరమణారెడ్డి, ప్రేమ్ నాయక్, కందుకూరి సుదర్శన్, గుణగంటి రమేష్ గౌడ్, మోహన్ రెడ్డి, భవాని, యాదయ్య, శ్రీనివాస్ గౌడ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్, డీజిల్ ధరల పెంపును వెంటనే వెనక్కి తీసుకోవాలి : చెన్నగోని శ్రీధర్ గౌడ్

**ఆర్టీసీ బస్సులో ప్రయాణించి బీఆర్ఎస్ శ్రేణుల వినూత్న నిరసన -పేద, మధ్యతరగతి ప్రజలపై పెరుగుతున్న ఆర్థిక భారం**



హయత్‌నగర్, జూన్ 6 (నగర నిజం): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇటీవల వరుసగా పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని బీఆర్ఎస్ హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు చెన్నగోని శ్రీధర్ గౌడ్ డిమాండ్ చేశారు. ఇంధన ధరల పెంపును నిరసిస్తూ శనివారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ఆర్టీసీ బస్సులో హయత్‌నగర్ నుంచి దిల్‌సుఖ్‌నగర్ వరకు ప్రయాణించి వినూత్నంగా ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీధర్ గౌడ్ మాట్లాడుతూ, పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండగా, ఇంధన ధరల పెంపు మరింత భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధ పరిస్థితులను కారణంగా చూపుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజలను నమ్మించి, ఎన్నికలు ముగిసిన అనంతరం గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడం సమంజసం కాదని ప్రశ్నించారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం కూడా పన్నుల పేరుతో ప్రజలపై అదనపు భారం మోపుతోందని విమర్శించారు. ప్రజల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పెంచిన ఇంధన ధరలను తగ్గించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గుడాల సందీప్, మధు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక్ నగర్-పవనగిరి కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి వేగం

**రెండు రోజుల్లో హనుమాన్ మార్గ్ రోడ్డు పూర్తి - వారం రోజుల్లో డబుల్ బెడ్‌రూమ్ వరకు సీసీ రోడ్డు నిర్మాణం: కొప్పుల నర్సింహ్మా రెడ్డి**




ఎల్బీనగర్, జూన్ 7 : ఉమ్మడి మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని వినాయక్ నగర్ కాలనీ హనుమాన్ మార్గ్ రోడ్డు నుంచి బొమ్మల గుడి వరకు కొనసాగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను రెండు రోజుల్లో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మాజీ జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ సందర్భంగా ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ వికాస్ మహతో (ఐఏఎస్), ఎంఎంసీ అధికారులతో మాట్లాడిన ఆయన, పనులు వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కోరారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నాణ్యత ప్రమాణాలతో రోడ్డు నిర్మాణం చేపట్టాలని సూచించారు. అదేవిధంగా పవనగిరి కాలనీ ఫేజ్--3 ఎంట్రన్స్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రాంతం నుంచి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వరకు నిర్మించాల్సిన అటాచ్ రోడ్డు పనులు కూడా మరో వారం రోజుల్లో పూర్తవుతాయని తెలిపారు. సదరు రోడ్డు నిర్మాణం ఆలస్యానికి కారణమైన సాంకేతిక సమస్యలను సంబంధిత ఇంజినీరింగ్ విభాగ అధికారులతో చర్చించి పరిష్కరించినట్లు వెల్లడించారు. ప్రజల రాకపోకలకు ఎంతో కీలకమైన ఈ రోడ్ల నిర్మాణం పూర్తయితే కాలనీవాసులకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని, మౌలిక వసతుల అభివృద్ధికి తమ కృషి నిరంతరం కొనసాగుతుందని కొప్పుల నర్సింహ్మా రెడ్డి పేర్కొన్నారు.

# తీసుకున్న డబ్బులు వెంటనే చెల్లించాలి

**తాండూర్ పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు...**



నగర నిజం తాండూర్ ప్రతినిధి జూన్ 6:తీసుకున్న డబ్బులు వెంటనే చెల్లించాలని కోరుతూ కొంతమంది మహిళలు, రాము నాయక్ వికారాబాద్ జిల్లా తాండూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. హైదరాబాద్ ఎల్బీనగర్ కు చెందిన పి. సుక్కమ్మ భర్త శేఖర్, ఎన్. శాంతమ్మ భర్త జైరాజు మహిళల నుంచి తాండూర్ కి చెందిన విఠల్ నాయక్ రూ. 40 లక్షలు అప్పుగా తీసుకున్నారని.., రూ. 40లక్షలకు అదనంగా రూ. 20లక్షలు కలిపి మొత్తం రూ. 60లక్షలు ఒక నెలలో ఇస్తారని తెలిపారు. కానీ ఇప్పటికి 5 నెలలు గడుస్తున్నా తీసుకున్న డబ్బులు ఇవ్వలేదని బాధిత మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిదంగా తీసుకున్న డబ్బులకి చెక్కులు, 6 ప్రామిసరీ నోటులు, హామీ పత్రాలు కూడా ఉన్నాయని చెప్పారు. తీసుకున్న డబ్బులు వెంటనే ఇవ్వాలని ఈ సందర్భంగా మహిళలు తాండూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తూ మాకు న్యాయం చేసి మా డబ్బులు తిరిగి ఇప్పించాలని బాధిత మహిళలు విజ్ఞప్తి చేశారు.

# ఆటోలో తీసుకెళ్లి మహిళ బంగారు కమ్మలు దోచుకున్న ఇద్దరు అరెస్ట్ : తూప్రాన్ సీఐ వెంకట్రాజ్ గౌడ్

**ఎల్దుర్తి పోలీసుల చాకచక్యంతో కేసు ఛేదన**

**దొంగిలించిన బంగారు కమ్మలు, ఆటో స్వాధీనం**



మెదక్ బ్యూరో: నగర నిజం: ఎల్దుర్తి, జూన్ 5:ఎల్దుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళను ఆటోలో ఎక్కించుకుని నిర్జన ప్రాంతానికి తీసుకెళ్లి బంగారు చెవి కమ్మలు దోచుకున్న ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు.పోలీసుల వివరాల ప్రకారం, మే 30న ఎల్దుర్తి మండలంలోని సెంట్రల్ బ్యాంక్ సమీపంలో రాజమ్మ అనే మహిళను నిందితులు మద్దూరి శ్రీకాంత్, ఎండి శైలాని ఆటోలో ఎక్కించుకుని ఆరేగూడెం వద్ద దింపుతామని నమ్మించారు. అనంతరం బస్వాపూర్ గ్రామ శివారులోని చెరువు కట్ట ప్రాంతానికి తీసుకెళ్లి కత్తితో బెదిరించి ఆమె చెవి కమ్మలను బలవంతంగా లాక్కొని పరారయ్యారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు జూన్ 5న తూప్రాన్-నర్సాపూర్ బ్రిడ్జి వద్ద నిందితులను పట్టుకుని అరెస్ట్ చేశారు. నిందితుడు మద్దూరి శ్రీకాంత్ వద్ద నుంచి ఆటోను స్వాధీనం చేసుకోగా, దొంగిలించిన బంగారు చెవి కమ్మలను కొత్తూరులోని కృష్ణ జ్యువెలరీ షాప్ నుంచి స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసును ఛేదించిన తూప్రాన్ సీఐ వెంకట్రాజ్ గౌడ్, ఎల్దుర్తి ఎస్సై జ్యోతి, సిబ్బంది గోవర్ధన్ రావు, కృష్ణ, సురేష్, మహేష్‌లను తూప్రాన్ డీఎస్పీ అభినందించి తగిన రివార్డులు అందజేస్తామని తెలిపారు.

# బురుజు గడ్డ తండాలో కోడి పందాల రాయుళ్ల అరెస్ట్

**కోడిపందాల గుట్టును రట్టు చేసిన ఎస్ఓటి టీమ్స్**
**8 మంది కోడిపందాల రాయుళ్ళ అరెస్ట్**
**సుమారు 10 వేల నగదు స్వాధీనం**
**11 పందెం కోళ్ళు, 8 మొబైల్ ఫోన్లతో పాటు కారు, 3 బైకులు సీజ్**












రాజేంద్రనగర్, జూన్ 6,(నగరనిజం ప్రతినిధి):రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం లోని బురుజు గడ్డ తండా కేంద్రంగా సాగుతున్న కోడిపందాల రాయుళ్ళ గుట్టును రట్టు చేశారు ఎస్ఓటి టీమ్స్. 8 మంది పందాల రాయుళ్లను అరెస్టు చేసిన ఎస్ఓటి టీమ్స్.... వారి వద్ద నుండి సుమారు పదివేల నగదు, 11 పందెపు కోళ్లతో పాటు ఎనిమిది మొబైల్ ఫోన్లు, కారు, మూడు ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శంషాబాద్ ఇన్స్పెక్టర్ నరేందర్ రెడ్డి కథనం ప్రకారం ఎస్ఓటి టీమ్స్ దాడులకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. శంషాబాద్ మండలం లోని పెద్ద షాపూర్ బురుజు గడ్డ తండా వద్ద ఈజీ మనీ కి అలవాటు పడ్డ కొందరు కోడిపందాల ఆటలు సాగిస్తున్నారు. గుట్టు చప్పుడు కాకుండా కోడిపందాల ఆట సాగుతుండడంతో ఎస్ఓటి టీమ్స్ దీనికి సంబంధించి పక్కా సమాచారాన్ని సేకరించారు. ఇంకేముంది అనుకున్నది ఆలస్యం అన్నట్లుగా శనివారం ఉదయం ఎస్ఓటి టీమ్స్ శంషాబాద్ పోలీసులతో కలిసి జాయింట్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ మేరకు కోడి పందాల గుట్టును రట్టు చేసిన ఎస్ఓటి టీమ్స్.... భీమవరానికి చెందిన కట్ట దుర్గా ప్రసాద్ (గండిగూడ), హయత్ నగర్ లోని ఎల్లారెడ్డి ప్రాంతానికి చెందిన బండారు హరికృష్ణ (42), ఈస్ట్ గోదావరి జిల్లాకు చెందిన కొక్కిర్లపాటి వర్మ (35), వెస్ట్ గోదావరి కి చెందిన గొట్టముక్కల మానస పాణి (25), శంషాబాద్ మండలం లోని పాలమాకుల గ్రామానికి చెందిన పళంగని రాంబాబు (45), తూర్పుగోదావరి జిల్లాకు చెందిన సయ్యాపు రాజు సోమరాజు (26), తూర్పుగోదావరి జిల్లాకు చెందిన సయ్యాపు రాజు భరత్ శివ రామరాజు (24), మహబూబ్నగర్ జిల్లాలోని జడ్చర్ల ప్రాంతానికి చెందిన దేవులపల్లి సంజయ్ రెడ్డి (28) ను అరెస్టు చేసిన ఎస్ఓటి టీమ్స్.... నిందితుల వద్ద నుండి 9900 నగదు, 11 పందెం కోళ్ళతో పాటు 8 మొబైల్ ఫోన్లు, ఒక కారు, మూడు బైకులను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ నిందితులను శంషాబాద్ పోలీసులకు అప్పగించారు. ఈ నేపథ్యంలో నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శంషాబాద్ సీఐ నరేందర్ రెడ్డి ప్రకటించారు.

## సూపర్ సీడ్స్ కంపెనీపై గ్రామస్థుల ఫిర్యాదు
## పంచాయతీ ఆదాయానికి నష్టం కలిగిస్తున్నారని ఆరోపణ



మెదక్ బ్యూరో : నగర నిజం'మనోహరాబాద్ గ్రామంలోని సూపర్ సీడ్స్ కంపెనీ నూతనంగా నిర్మించిన షేడ్కు గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి అసెస్మెంట్ నంబర్ ఇవ్వలేదని, అలాగే ఎలాంటి పన్నులు (టాక్స్) వసూలు చేయడం లేదని గ్రామస్థులు ఆరోపించారు. దీంతో గ్రామ పంచాయతీకి రావాల్సిన ఆదాయం నష్టపోతుందని పేర్కొంటూ గ్రామ పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు.కంపెనీ నిర్మాణంపై విచారణ జరిపి, నిబంధనల ప్రకారం పన్నులు విధించాలని, గ్రామ పంచాయతీ ఆదాయానికి నష్టం కలిగించినట్లయితే సంబంధిత సంస్థపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు వినతిపత్రం ద్వారా కోరారు.

## పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రతపై గ్రామస్తులతో ప్రమాణం
## జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షులు మన్నే కళ్యాణ్

**మొక్కలు నాటాలని గ్రామస్తులతో ప్రమాణం**



మెదక్ బ్యూరో : నగర నిజం :మనోహరాబాద్ మండలంలోని కోనాయిపల్లి గ్రామంలో గ్రామ సభను ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్, జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షులు మన్నే కళ్యాణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ గ్రామ సభలో పర్యావరణ పరిరక్షణ, గ్రామ పరిశుభ్రతపై ప్రత్యేక అవగాహన కల్పించారు.గ్రామ సభలో పాల్గొన్న గ్రామస్తులు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం, పర్యావరణాన్ని కాపాడడం, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం, తడి-పొడి చెత్తను వేర్వేరుగా నిర్వహించడం వంటి అంశాలపై ప్రమాణం చేశారు.ఈ సందర్భంగా గ్రామ సెక్రటరీ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రావణ్ కుమార్ గౌడ్, వార్డు సభ్యులు మహేష్, సురేష్, లావణ్య, అర్జున్, గ్రామస్తులు, ఆశా వర్కర్లు, నర్సులు తదితరులు పాల్గొన్నారు.

# పెద్ద షాపూర్ నాగసముద్రంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

**పోలీసులకు సమాచారం అందించిన స్థానికులు**
**మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించిన శంషాబాద్ పోలీసులు**






రాజేంద్రనగర్, జూన్ 6(నగరనిజం ప్రతినిధి)రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం లోని పెద్ద షాపూర్ నాగసముద్రం చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమయింది. స్థానికులు అందించిన సమాచారం మేరకు ఘటనా స్థలాన్ని సందర్శించిన శంషాబాద్ పోలీసులు.... కుళ్లిపోయిన వ్యక్తి మృతదేహాన్ని వెలికి తీయించి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన పెద్ద షాపూర్ సమీపం లోని నాగసముద్రం చెరువులో శనివారం నాడు చోటుచేసుకుంది. శంషాబాద్ సీఐ నరేందర్ రెడ్డి కథనం ప్రకారం..... శంషాబాద్ మండలం పెద్ద షాపూర్ సమీపంలోని నాగ సముద్రం చెరువులో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలాన్ని సందర్శించిన పోలీసులు.... కుళ్లిపోయిన వ్యక్తి మృతదేహాన్ని చెరువులో నుండి వెలికి తీయించి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి వయసు 45-50 మధ్యలో ఉంటుందని తెలిపిన శంషాబాద్ సీఐ నరేందర్ రెడ్డి... మృతుడి ఒంటిపై కాకి కలర్ షర్టు, బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నట్లు చెప్పారు. అదేవిధంగా నడుముకి రెడ్ కలర్ చుట్టుకొని ఉన్నట్లు తెలిపిన సీఐ నరేందర్ రెడ్డి.... అతని కుడి చేతికి తెలుపు రంగు గల కడియం ఉన్నట్లు చెప్పారు. మృతుడికి సంబంధించిన బంధువులు ఎవరైనా ఉంటే వెంటనే శంషాబాద్ పోలీసులను సంప్రదించాలని ఆయన సూచించారు. ఈ మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ప్రకటించారు.

# కల్లు తాగిన కోతుల్లా ఓఆర్ఆర్పై యువకుల విన్యాసాలు

**వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వాహనదారులు**
**రంగంలోకి దిగి నిందితుల ఆట కట్టించిన రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు**
**ఐదుగురు నిందితుల అరెస్ట్, కారు సీజ్**
**నిందితులను నార్సింగి పోలీసులకు అప్పగింత**
**మీడియాకు వివరాలు వెల్లడించిన ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజు**








రాజేంద్రనగర్, జూన్ 6 (నగరనిజం ప్రతినిధి) వాయు వేగంతో దూసుకెళ్ళే వాహనాలు ఒకవైపు.... కల్లు తాగిన కోతుల్లా కారులో ప్రయాణిస్తూ యువకుల ప్రమాదకరమైన విన్యాసాలు మరోవైపు.... వెరసి ఆకతాయిల విన్యాసాలను వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వాహనదారులు.... ఫలితం వీడియో కాస్త వైరల్ కావడంతో రంగంలోకి దిగిన రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు.... ఆకతాయిల ఆట కట్టించి శ్రీకృష్ణ జన్మస్థానానికి తరలించారు. ఔటర్ రింగ్ రోడ్డుపై సంచలనం సృష్టించిన ఘటన శనివారం నాడు చోటుచేసుకుంది.రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సీహెచ్. రాజు తెలిపిన వివరాల ప్రకారం ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం రాత్రి కొందరు యువకులు స్విఫ్ట్ డిజైర్ కారు (టీఎస్ 35,హెచ్ 5397) లో ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రయాణిస్తూ ప్రమాదకరమైన విన్యాసాలు చేశారు. అసలే ఔటర్ రింగ్ రోడ్డు.... ఆపై వాయువేగంతో దూసుకెళ్లే వాహనాల స్పీడ్... అలాంటి ఎక్స్ప్రెస్ వే పై కొందరు ఆకతాయిలు ప్రమాదకరమైన విన్యాసాలు చేస్తూ తోటి వాహనదారులకు చుక్కలు చూపించారు. దీంతో ఆ సమయంలో ఔటర్ పై ప్రయాణిస్తున్న కొందరు వాహనదారులు యువకుల పిచ్చి చేష్టలను వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఇది కాస్త వైరల్ కావడంతో రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వీహెచ్ రాజు ఆధ్వర్యంలో రంగంలోకి దిగిన ట్రాఫిక్ పోలీసులు.... వీడియో ఆధారంగా నిందితులను గుర్తించారు. ఈ మేరకు నిందితులు మహమ్మద్ షోయబ్ (కారు డ్రైవర్), మహమ్మద్ సమీర్ (కారు యజమాని), మహమ్మద్ నవాజ్, శాహెబజుల్లా, జహీద్ ఖదీర్ అనే ఐదుగురు యువకులను అరెస్టు చేసి వారు ప్రయాణించిన కారును సీజ్ చేసినట్లు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజు శనివారం సాయంత్రం ప్రకటించారు. పట్టుబడ్డ నిందితులను నార్సింగి పోలీసులకు అప్పగించినట్లు చెప్పారు. ఔటర్ రింగ్ రోడ్డుపై ఎవరైనా ట్రాఫిక్ నిబంధన ఉల్లంఘించి పిచ్చి చేష్టలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజు తీవ్రంగా హెచ్చరించారు.

# అమరం వసుంధరకు శ్రీ మహానంది అవార్డు-2026

**తెలంగాణ మ్యారేజ్ బ్యూరో మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 5వ వార్షికోత్సవ వేడుకల్లో ఘన సత్కారం**





హైదరాబాద్, జూన్ 7 (నగర నిజం): తెలంగాణ మ్యారేజ్ బ్యూరో మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించిన 5వ వార్షికోత్సవ వేడుకల్లో వసుంధర మ్యాట్రిమోనీ నిర్వాహకురాలు అమరం వసుంధరకు ప్రతిష్టాత్మక "శ్రీ మహానంది అవార్డు--2026"ను ప్రదానం చేశారు. అసోసియేషన్ వ్యవస్థాపకుడు, రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ గౌడ్ చేతుల మీదుగా ఆమె ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా "బుర్ర శ్రీనివాస్ గౌడ్" మాట్లాడుతూ, వివాహ సేవా రంగంలో విశేష సేవలు అందిస్తూ సమాజానికి ఉపయోగపడుతున్న వ్యక్తులను గుర్తించి ప్రోత్సహించాలనే ఉద్దేశంతో పదిమంది నూతన నూతన వధూవరులను ఒకటిగా కలిపినందుకు గాను శ్రీ మహానంది అవార్డులను అందజేస్తున్నామని తెలిపారు. సమాజ సేవ, వివాహ సంబంధ సేవల ద్వారా ప్రజలకు చేరువైన వారిని సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. అవార్డు అందుకున్న "అమరం వసుంధర" మాట్లాడుతూ, తన సేవలను గుర్తించి ప్రతిష్టాత్మక అవార్డుతో సత్కరించడం ఎంతో గౌరవంగా భావిస్తున్నానని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివాహ సంబంధ సేవలను మరింత విస్తృతంగా అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా మ్యారేజ్ బ్యూరో నిర్వాహకులు, వివిధ రంగాల ప్రముఖులు, సంఘ సభ్యులు, ఆహ్వానితులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పీవీ ఎక్స్ప్రెస్ వే పై పోలీసుల నిబంధనలు బే ఖాతర్

### ప్రాణాలు పోతున్న లెక్కచేయని ద్విచక్ర వాహనదారులు

## ట్రాఫిక్ పోలీసులకు మస్కా కొట్టి పీవీ ఎక్స్ప్రెస్ వే పై దూసుకెళ్తున్న ద్విచక్ర వాహనదారులు












రాజేంద్రనగర్, జూన్ 6,(నగరనిజం ప్రతినిధి):పీవీ నరసింహారావు ఎక్స్ప్రెస్ వే పై ప్రయాణించి ప్రాణాలు తీసుకోవద్దు.... ద్విచక్ర వాహనాలు, ఆటోల ప్రయాణానికి అనుమతి లేదు అని ట్రాఫిక్ పోలీసులు నెత్తి, నోరు బాదుకుంటున్నప్పటికీ వాహనదారులు డోంట్ కేర్ అంటున్నారు. ద్విచక్ర వాహనాలతో దూసుకెళ్తూ రోడ్డు ప్రమాదాలకు గురై అమాయకులు ప్రాణాలు పోతున్నా లెక్కచేయడం లేదు. పట్టుకోండి చూద్దాం.... అంటూ పీవీ ఎక్స్ప్రెస్ వే పై విధుల్లో ఉన్న ట్రాఫిక్ పోలీసులకు మస్కా కొట్టి రయ్ రయ్ మంటూ ద్విచక్ర వాహనాలతో దూసుకెళ్తున్నారు. రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్ వద్ద రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఏర్పాటు చేశాక హైదరాబాదులో ట్రాఫిక్ సమస్యకు చెక్ పెడుతూ విమాన ప్రయాణికులు త్వరగా ఎయిర్ పోర్ట్ కు చేరే విధంగా హైదరాబాద్ చుట్టూ ప్రభుత్వం భారీ ఫ్లై ఓవర్లను చేపట్టింది. ఇందులో భాగంగా మెహదీపట్నం నుండి అత్తాపూర్, ఉప్పర్ పల్లి మీదుగా ఆరాంఘర్ చౌరస్తా వరకు దాదాపు 10 కిలోమీటర్ల మేర పీవీ ఎక్స్ప్రెస్ వే ఫ్లై ఓవర్ ను నిర్మించారు. అయితే వాహనాల స్పీడు, రోడ్డు ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని ఈ వంతెన పై ద్విచక్ర వాహనాలు ఆటోలతో పాటు భారీ సరుకు రవాణా వాహనాలకు అనుమతిని నిషేధించారు. ఈ మేరకు మెహదీపట్నం నుండి ఆరాంఘర్ చౌరస్తా వరకు పీవీ నరసింహారావు ఎక్స్ప్రెస్ వే పై నిషేధిత వాహనాలను నియంత్రించడానికి ట్రాఫిక్ పోలీసులను నియమించారు. అయితే కొందరు ఆకతాయిలు ట్రాఫిక్ నిబంధన ఉల్లంఘిస్తూ తరచూ ద్విచక్ర వాహనాలతో పీవీ ఎక్స్ప్రెస్ వేపై దూసుకెళ్తున్నారు. వీరిలో చాలామంది రోడ్డు ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయారు. ద్విచక్ర వాహనాలను తప్పించబోయి కార్లు ఒకదానికొకటిగా ఢీకొన్న సందర్భాలు అనేకం ఉన్నాయి. అయితే ద్విచక్ర వాహనాలు, ఆటోలతోపాటు భారీ వాహనాల రాకపోకల పై ట్రాఫిక్ పోలీసులు నిషేధం విధించినప్పటికీ ద్విచక్ర వాహనదారులతోపాటు ఆటో డ్రైవర్లలో సైతం మార్పు రావడం లేదు. పట్టుకోండి చూద్దాం అంటూ ట్రాఫిక్ పోలీసులకు మస్కా కొట్టి ద్విచక్ర వాహనాలు, ఆటోలతో ఎక్స్ప్రెస్ వే పై దూసుకెళ్తున్నారు. ఎక్స్ప్రెస్ వే పై విధుల్లో ఉన్న ట్రాఫిక్ పోలీసులు ఒక్కో సందర్భంలో ఏమరపాటుగా ఉంటుండడంతో ఇదే అదను గా భావించి ద్విచక్ర వాద్విచక్ర రెచ్చిపోతున్నారు. ప్రాణాలు పోతాయని తెలిసి కూడా డోంట్ కేర్ అంటూ నిబంధనలకు పాతర వేస్తున్నారు. శనివారం మధ్యాహ్నం ఓ ద్విచక్ర వాహనదారుడు (టీఎస్ 35, ఈ 1643) బైకు పై ఆరాంఘర్ చౌరస్తా నుండి మెహదీపట్నం వైపు పీవీ ఎక్స్ ప్రెస్ వే పై నిబంధనలకు విరుద్ధంగా దర్జాగా దూసుకెళ్లాడు. దీంతో ద్విచక్ర వాహనాన్ని తప్పించుకొని ముందుకు కదలడానికి వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. అసలే వాయువేగంతో దూసుకెళ్లే వాహనాలు. ఈ తరుణంలో ద్విచక్ర వాహనం కారణంగా అనుకోని విధంగా ఏదైనా ప్రమాదం జరిగితే పరిస్థితి ఏమిటని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పీవీ ఎక్స్ప్రెస్ వే పైట్రాఫిక్ పోలీసులు నిబంధనలను కఠిన తరం చేస్తున్నప్పటికీ వాహనదారుల్లో మార్పు రావడం లేదు.

NN TV
TELANGANA
నగర నిజం